# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 281, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) బుధవారం - 25- డిసెంబర్ - 2024


## ముందే నిర్ణయించారు..

### ఎన్‌హెచ్చార్సీ చీఫ్ నియామకంపై కాంగ్రెస్ ఆరోపణలు



ఎంపిక ప్రక్రియ లోపభూయిష్టంగా ఉందన్న రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే

పరస్పర సంప్రదింపులు, ఏకాభిప్రాయాన్ని విస్మరించారని మండిపాటు

## చరిత్ర సృష్టించనున్న నాసా స్పేస్‌క్రాఫ్ట్

### ఇప్పటికే ఆ స్పేస్‌క్రాఫ్ట్ 21 సార్లు సూర్యుడిని చుట్టేసింది



డిసెంబర్ 24వ తేదీన సూర్యుడి బహ్యావలయమైన కరోనాకు సమీపంగా పార్కర్ ప్రోబ్ వెళ్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు

ఒకవేళ సూర్యుడి అగ్నితాపాన్ని తట్టుకుంటే, ఆ స్పేస్‌క్రాఫ్ట్ డిసెంబర్ 27వ తేదీన మళ్లీ సిగ్నల్స్ పంపిస్తుందని శాస్త్రవేత్తలు అంచనా

## విజయవంతంగా వందే భారత్ స్లీపర్ ట్రయల్ రన్..

### ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కింది



వందేభారత్ రైలును గంటకు 160 నుంచి 200 కి.మీ. స్పీడ్‌తో వెళ్లేలా తయారుచేశారు.

ప్రతి కోచ్‌లో సీసీ కెమెరాలు..

గ్వాలియర్: ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కింది. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ప్యాసింజర్ ట్రెయిన్‌ను విజయవంతంగా పరీక్షించారు. మధ్యప్రదేశ్‌లోని మిగతా 2లో..

## అల్లు అర్జున్ పట్ల రేవంత్ రెడ్డి దారుణంగా వ్యవహరిస్తున్నారు



- సంధ్య ఘటనను రాజకీయాల కోసం వాడుకోవడం సరికాదన్న డీకే అరుణ
- సినీ పరిశ్రమ, రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి అండగా ఉండాలన్న బీజేపీ ఎంపీ
- అల్లు అర్జున్ పట్ల పోలీసుల తీరు సరైంది కాదన్న డీకే అరుణ

హైదరాబాద్, : సీఎం రేవంత్ రెడ్డి తన స్వార్థ రాజకీయాల కోసం అల్లు అర్జున్ పట్ల దారుణంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనను తన రాజకీయాల కోసం వాడుకోవడం సరికాదన్నారు. ఇక్కడ సినిమా హీరోలా? రాజకీయ నాయకులా? మిగతా 2లో..

## భారతమాత కన్న తెలంగాణ ముద్దుబిడ్డ..

# శ్యామ్ బెనెగల్: కేసీఆర్

- దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత పద్మ భూషణ్ శ్యామ్ బెనగల్
- శ్యామ్ బెనగల్ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం
- భారతీయ సినిమాకు వన్నె తెచ్చిన శ్యామ్ బెనెగల్ తెలంగాణకు గర్వకారణం
- డిసెంబర్ 14న ఆయన మిత్రులు, కుటుంబ సభ్యులతో కలసి తన 90వ పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు




హైదరాబాద్: భారతీయ సినిమా దర్శక దిగ్గజం, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత పద్మ భూషణ్ శ్యామ్ బెనగల్ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. విస్మరించబడిన మనుషుల సామాజిక నేపథ్యాలకు సినిమా రంగంలో సమాంతర స్థానం కల్పించి, సామాన్యుల జీవన ఇతివృత్తాలకు వెండితెర గౌరవం కల్పించిన గొప్ప దర్శకుడని, భరత మాత కన్న తెలంగాణ ముద్దు బిడ్డ శ్యామ్ బెనగల్ (బెనగల్ల శ్యామ్ సుందర్ రావు) అని కొనియాడారు.

**1934 డిసెంబర్ 14న హైదరాబాద్‌లో జన్మించిన శ్యామ్ బెనగల్ కొంకణీ మాట్లాడే చిత్రపూర్ సారస్వత్ బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు**

## చట్టం రేవంత్ రెడ్డికి చుట్టంగా మారింది



- అల్లు అర్జున్ ఇంటిపై దాడి చేసిన వారంతా రేవంత్ రెడ్డితో ఫొటో దిగిన గూండాలే
- సిద్దిపేటలోనూ క్యాంప్ కార్యాలయంపై దాడి చేశారని ఆగ్రహం
- ఇప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావన్న హరీశ్ రావు
- గురుకులాల్లో విద్యార్థులు చనిపోతే స్పందించడం లేదని ఆరోపణ

హైదరాబాద్, : జుబ్లీహిల్స్‌లోని సినీ నటుడు అల్లు అర్జున్ నివాసంపై దాడి చేసిన వారంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఫొటో దిగిన కాంగ్రెస్ గూండాలేనని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. రేవంత్ రెడ్డితో ఫొటో దిగిన వాళ్లే అల్లు అర్జున్ ఇంటి మీద దాడి చేశారన్నారు. అంతకుముందు సిద్దిపేటలో కూడాగూండాలతో తన క్యాంప్ కార్యాలయం మీద దాడి చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా 2లో..

## ఎన్నికల నిబంధనల్లో మార్పులు.. సుప్రీం కోర్టులో కాంగ్రెస్ పిటిషన్



పోలింగ్ బూత్‌లలోని సీసీ టీవీ కెమెరాల తనిఖీవల్ల ఓటర్ల గోప్యతకు భంగం కలుగుతోందని, అందుకే నిషేధం విధించామని ఈసీ వర్గాలు వెల్లడి

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ పార్టీ కోర్టుకెక్కింది. ఎన్నికల నిర్వహణ నిబంధనల్లో ఒక రూల్‌కు ఇటీవల ఈసీ సవరణ చేసింది. అయితే.. ఈ చర్యతో ఎన్నికల ప్రక్రియ సమగ్రత క్షీణిస్తోందంటూ కాంగ్రెస్ సర్వోన్నత న్యాయస్థానంలో మంగళవారం ఓ రిట్ పిటిషన్ వేసింది. ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను ఎవరైనా తనిఖీ చేసేందుకు గతంలో అనుమతి ఉండేది. మిగతా 2లో..

## భక్తులకు అలర్ట్... టీటీడీ కీలక నిర్ణయాలు



- తిరుమల అభివృద్ధిపై టీటీడీ పాలకమండలి కీలక నిర్ణయాలు
- దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలో టీటీడీ ఆలయాలు నిర్మిస్తాం
- తిరుమల పర్యటనలో భక్తుల ఆరోగ్య సమస్యలు గుర్తించి సేవలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు

తిరుమల: తిరుమల అభివృద్ధిపై టీటీడీ పాలకమండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

# హలో ఆంధ్రా...

- అనకాపల్లిలో మరోసారి ప్రధాని ఆవాజ్.. ఎప్పుడంటే..?
- జనవరి ఎనిమిదిన ప్రధాని మోదీ అనకాపల్లి పర్యటన
- గ్రీన్ హైడ్రోజన్ హబ్, ఆర్సెలర్ స్టీల్ ప్లాంట్..
- అనకాపల్లి జిల్లాలో అల్యూమినియం కొత్త ప్లాంట్ ఏర్పాటుకు కృషి
- సహా మరి కొన్ని అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో కలిసి ప్రధాని మోదీ శ్రీకారం



- మూడు కేంద్రీయ విద్యాలయాలయాలు రాబతున్నాయి

న్యూఢిల్లీ,: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటన దాదాపు ఖరారైంది. జనవరి ఎనిమిదిన ప్రధాని మోదీ అనకాపల్లి వస్తారని పార్లమెంటు సభ్యులు సీఎం రమేశ్ ప్రకటించారు. గ్రీన్ హైడ్రోజన్ హబ్, ఆర్సెలర్ స్టీల్ ప్లాంట్.. సహా మరి కొన్ని అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో కలిసి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టనున్నారు. మిగతా 2లో..

## కష్టాలనేవి శాశ్వతం కావు...

# 2027 చివర్లో జమిలి ఎన్నికలు

దేశ చరితలో ఏ ఒక్కరూ చేయని మంచి పనులు చేశాం

మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేసే సంప్రదాయాన్ని మనం మార్చాం

కోవిడ్ సమయంలో కూడా సంక్షేమాన్ని ఆపలేదు

అధికారంలో ఉన్నా, లేకపోయినా నిత్యం మనం ప్రజల కోసమే పోరాడాలి'



వైఎస్సార్ జిల్లా,: ఎన్నికలకు ముందు అలవి గాని హామీలు ఇచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పులివెందుల పర్యటనలో భాగంగా.. కడప నేతలు, కార్పొరేటర్లతో తాజా పరిణామాల పై ఆయన చర్చించారు. మిగతా 2లో..

## అంబేద్కర్‌ను మానసిక క్షోభకు గురిచేసింది కాంగ్రెస్సే



కాంగ్రెస్ పార్టీయే అవమానించిందన్న బీజేపీ ఎంపీ

ఎన్నికల్లో ఓడించి పార్లమెంట్‌లో అడుగుపెట్టనీయలేదంటూ ఆరోపణ

రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడిన ఏపీ బీజేపీ అధ్యక్షురాలు

న్యూఢిల్లీ,: కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్ సాక్షిగారాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను అవమానించారని, మంత్రి పదవికి ఆయన రాజీనామా చేయాలంటూ

## 2007 నాటి కేసులో విజయవాడ కోర్టుకు

# హాజరైన ఏపీ, తెలంగాణ నేతలు



ఉమ్మడి ఏపీలో 2007లో ఓబులాపురం మైనింగ్ పరిశీలనకు వెళ్లిన నేతలు

కోర్టుకు హాజరైన అచ్చెన్నాయుడు, దేవినేని ఉమ, చినరాజప్ప

తెలంగాణ నుంచి నాగం జనార్దన్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకరరావు హాజరు

**అమరావతి,:** ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందినపలువురురాజకీయ నాయకులు విజయవాడ లోకలిశారు!ఉమ్మడి ఏపీలో 2007లో

శుభోదయం
బుధవారం - 25 - డిసెంబర్ - 2024

# ముందే నిర్ణయించారు..
## ఎన్‌హెచ్చార్సీ చీఫ్ నియామకంపై కాంగ్రెస్ ఆరోపణలు

మొదటి పేజీ తరువాయి

**న్యూఢిల్లీ,:** జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్చార్సీ) చైర్మన్, సభ్యుల ఎంపికపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఎంపిక ప్రక్రియ లోపభూయిష్టంగా ఉందని, ముందే నిర్ణయించి అందుకు అనుగుణంగా కసరత్తు చేపట్టారంటూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆరోపణలు గుప్పించారు. పరస్పర సంప్రదింపులు జరపలేదని, ఏకాభిప్రాయాన్ని తీసుకోలేదని విమర్శించారు. ఎన్‌హెచ్చార్సీ చైర్మన్ పదవికి జస్టిస్ రోహింటన్ ఫాలీ నారీమన్, జస్టిస్ కుట్టియిల్ మాథ్యూ జోసెఫ్ పేర్లను రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ప్రతిపాదించారు. అయితే, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి వి.రామసుబ్రమణియన్ ఎన్‌హెచ్చార్సీ చీఫ్‌గా ఎంపికయ్యారు. సభ్యుల స్థానానికి జస్టిస్ ఎస్ మురళీధర్, జస్టిస్ అకిల్ అబ్దుల్ హమీద్ ఖురేషీల పేర్లను సిఫార్సు చేశారు. వీరిద్దరికీ మానవ హక్కులను సమర్థించడంలో చక్కటి ట్రాక్ రికార్డులు ఉన్నాయని సూచించారు. అయినప్పటికీ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని, వీరి చేరిక ఎన్‌హెచ్చార్సీలో వైవిధ్యానికి దోహదం చేస్తుందని అసమ్మతి నోట్‌లో పేర్కొన్నారు. ఎన్‌హెచ్చార్సీ చైర్మన్ నియామకంలో ప్రాంతం, మతం, కులాల సమతుల్యతను పాటించలేదని అన్నారు. ఈ మేరకు అసమ్మతి నోట్‌లో రాహుల్ గాంధీ, ఖర్గే పేర్కొన్నారు. ఇటువంటి ఎంపిక ప్రక్రియ 'ప్రభుత్వ తోసిపుచ్చే విధానాన్ని' స్పష్టం చేస్తోందని ఆరోపించారు.

## చరిత్ర సృష్టించనున్న నాసా స్పేస్‌క్రాఫ్ట్
## ఇప్పటికే ఆ స్పేస్‌క్రాఫ్ట్ 21 సార్లు సూర్యుడిని చుట్టేసింది

మొదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ: నాసా ప్రయోగించిన పార్కర్ సోలార్ ప్రోబ్ స్పేస్‌క్రాఫ్ట్ ఇప్పుడు చరిత్ర సృష్టించనున్నది. ఆ స్పేస్‌క్రాఫ్ట్ సూర్యుడికి అత్యంత సమీపంగా వెళ్లనున్నది. అతిభయంకరమైన వాతావరణం, రేడియేషన్‌ను తట్టుకుని ఆ వ్యోమనౌక .. సూర్యడి సమీపానికి వెళ్తున్నది. డిసెంబర్ 24వ తేదీన సూర్యుడి బహ్యావలయమైన కరోనాకు సమీపంగా పార్కర్ ప్రోబ్ వెళ్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే భగభగ మండే భానుడికి సమీపంగా ఉన్న కారణంగా.. ఆ స్పేస్‌క్రాఫ్ట్ నుంచి కొన్ని రోజుల పాటు సిగ్నల్స్ అందవని తెలిసింది. ఒకవేళ సూర్యడి అగ్నితాపాన్ని తట్టుకుంటే, ఆ స్పేస్‌క్రాఫ్ట్ డిసెంబర్ 27వ తేదీన మళ్లీ సిగ్నల్స్ పంపిస్తుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. కరోనా లేయర్‌కు సమీపానికి వెళ్లడం వల్ల సూర్యుడు ఎలా పనిచేస్తాడన్న అధ్యయనాన్ని మరింత లోతుగా విశ్లేషించే అవకాశాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. శతాబ్ధాలుగా సూర్యుడి గురించి ప్రజలు స్టడీ చేశారని, కానీ అతి సమీపం నుంచి ఆ వాతావరణాన్ని ఎవరూ అనుభవించలేదని నాసా శాస్త్రవేత్త డాక్టర్ నికోలా ఫాక్స్ తెలిపారు. 6 లక్షల 92 వేల కిలోమీటర్ల వేగంతో పార్కర్ ప్రోబ్ ప్రయాణిస్తోంది. సూర్యుడి కరోనాకు సమీపంగా వెళ్తున్న సమయంలో.. పార్కర్ ప్రోబ్ మెషిన్ సుమారు 982 డిగ్రీల సెల్సియస్ వేడిని తట్టుకోవాల్సి ఉంటుంది. 2018లో పార్కర్‌ను తొలిసారి ప్రయోగించారు. ఇప్పటికే ఆ స్పేస్‌క్రాఫ్ట్ 21 సార్లు సూర్యుడిని చుట్టేసింది. సుమారు 4.5 ఇంచుల కార్బన్ కంపోజిట్ షీల్డ్ ఉన్న పార్కర్ స్పేస్‌క్రాఫ్ట్.. చాలా వేగంగా కరోనాను తాకి మళ్లీ బయటి వాతావరణంలోకి రానున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కరోనా చాలా వేడిగా ఉంటుందన్న విషయం తెలిసిందే. కానీ ఎందుకు అక్కడ వాతావరణం అలా ఉందో తెలుసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఖగోళశాస్త్రవేత్త డాక్టర్ జెన్నిఫర్ మిల్లార్డ్ తెలిపారు. సూర్యుడి కేంద్రానికి 6.1 మిలియన్ల కిలోమీటర్ల దూరం నుంచి పార్కర్ ప్రయాణించనున్నది.

## అల్లు అర్జున్ పట్ల రేవంత్ రెడ్డి దారుణంగా వ్యవహరిస్తున్నారు

మొదటి పేజీ తరువాయి

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనను తన రాజకీయాల కోసం వాడుకోవడం సరికాదన్నారు. ఇక్కడ సినిమా హీరోలా? రాజకీయ నాయకులా? మరొకరా? అనే విషయం పక్కన పెడితే రాజకీయాలు చేయవద్దన్నారు. అల్లు అర్జున్ అరెస్ట్, ఆయన కుటుంబాన్ని ఇబ్బందిపెట్టడం, ఇంటిపై దాడి... ఇవన్నీ కక్ష సాధింపు చర్యలేనని మండిపడ్డారు. ఆమె కిమ్స్ ఆసుపత్రిలో శ్రీతేజ్‌ను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ... సినీ పరిశ్రమ, రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి అండగా ఉండాలని సూచించారు. శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానన్నారు. రేవతి మరణం బాధాకరమన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆలోచించాలని సూచించారు. కాంగ్రెస్, మజ్లిస్ ఒకటేనని అసెంబ్లీ జరుగుతున్న తీరును చూసిన ఎవరికైనా అర్థమవుతుందన్నారు. సంధ్య థియేటర్ ఘటనపై మజ్లిస్ పార్టీతో ప్రశ్న అడిగించుకొని... రేవంత్ రెడ్డి సమాధానం ఇచ్చినట్లుగా ఉందన్నారు. అల్లు అర్జున్ పట్ల పోలీసుల తీరు సరైంది కాదన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి వ్యవహారాలను రాజకీయం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో శాంతిభద్రతలు గాడి తప్పాయన్నారు.

## చట్టం రేవంత్ రెడ్డికి చుట్టంగా మారింది

మొదటి పేజీ తరువాయి

అంతకుముందు సిద్దిపేటలో కూడా గూండాలతో తన క్యాంప్ కార్యాలయం మీద దాడి చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక వ్యక్తిని టార్గెట్ చేసి కేసులు పెట్టడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని, అందరూ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. అల్లు అర్జున్ కేసు వ్యవహారంలో రేవంత్ రెడ్డి చూపతున్న ఆసక్తి అన్ని వర్గాల మీద కూడా చూపించాలన్నారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో రేవతి మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. అదే సమయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గురుకులాలు, హాస్టళ్లలో 50 మందికి పైగా పిల్లలు చనిపోతే ఇంతవరకు స్పందించలేదన్నారు. ఆ పిల్లల ప్రాణాలకు విలువలేదా? అని నిలదీశారు. నీ తమ్ముడి అరాచకాల వల్ల చనిపోతున్నానంటూ రేవంత్ రెడ్డి సొంత గ్రామంలో మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకుంటే ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపించారు. ఇంతవరకు సీఎం తన తమ్ముడిని అరెస్ట్ చేయలేదన్నారు. చట్టం అందరికీ సమానంగా ఉండాలని, కానీ రేవంత్ రెడ్డికి చుట్టంగా మారిందని విమర్శించారు. ప్రశ్నించే గొంతుల మీద కాంగ్రెస్ ప్రభుత్వం దాడి చేస్తోందన్నారు. భౌతిక దాడుల ద్వారా ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేస్తూ, తద్వారా ప్రశ్నించకుండా చేయాలని ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఇలాంటి సంస్కృతి తెలంగాణలో ఎప్పుడూ లేదన్నారు. రాయలసీమ తరహా ఫ్యాక్షనిస్ట్ సంస్కృతిని తెలంగాణలో తెచ్చి లా అండ్ ఆర్డర్‌ను రేవంత్ రెడ్డి కుప్పకూల్చుతున్నాడని ఆరోపించారు. ఈ సంస్కృతిని తెలంగాణ సమాజం హర్షించదన్నారు.

## ఎన్నికల నిబంధనల్లో మార్పులు..
## సుప్రీం కోర్టులో కాంగ్రెస్ పిటిషన్

మొదటి పేజీ తరువాయి

ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను ఎవరైనా తనిఖీ చేసేందుకు గతంలో అనుమతి ఉండేది. అయితే ఈసీ ఈ మధ్యే ఈ రూల్‌కు సవరణ చేసింది. కొత్త రూల్ ప్రకారం.. ఇక నుంచి పోలింగ్‌కు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజ్‌ను, వెబ్‌కాస్టింగ్ రికార్డులను, అభ్యర్థులకు చెందిన వీడియో రికార్డులను తనిఖీ చేయకుండా నిషేధం విధించింది. కొత్త సవరణతో ఎలక్ట్రానిక్ రికార్డులు మినహా ఇతర పత్రాలు, డాక్యుమెంట్లు తనిఖీకి అందుబాటులో ఉంటాయి. పోలింగ్ బూత్‌లలోని సీసీ టీవీ కెమెరాల తనిఖీవల్ల ఓటర్ల గోప్యతకు భంగం కలుగుతోందని, అందుకే నిషేధం విధించామని ఈసీ వర్గాలు వెల్లడించాయి. పైగా ఫుటేజ్‌ను వినియోగించుకుని కృత్రిమ మేధ ద్వారా నకిలీ వీడియోలను తయారు చేస్తున్నారని తెలిపాయి. రూల్ 93కి సవరణ తర్వాతా అభ్యర్థులకు ఎలక్ట్రానిక్ రికార్డులు అందుబాటులో ఉంటాయని, కానీ ఇతరులు తనిఖీ చేయడానికి అనుమతి ఉండదని స్పష్టత ఇచ్చింది. ఎన్నికల సంఘం సిఫార్సు మేరకే.. ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961లోని రూల్ 93(2)(ఏ)ను కేంద్ర న్యాయశాఖ సవరించింది. ఈ సవరణకు ఓ కోర్టు కేసు కారణమని ఈసీతోపాటు న్యాయశాఖ వేర్వేరుగా గత శుక్రవారం వివరణ ఇచ్చాయి. ఇక.. అయితే ఈ పరిణామంపై కాంగ్రెస్ మండిపడింది. ఎన్నికల్లో పారదర్శకతకు ఇది విఘాతమని స్పష్టం చేసింది. ఎన్నికల నిబంధనను మార్చడంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. పారదర్శకతకు ఈసీ ఎందుకు భయపడుతోందని ప్రశ్నించింది. ఈ సవరణను న్యాయపరంగా సవాలు చేస్తామని ఇంతకు ముందే కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పష్టం చేశారు. కోర్టు తీర్పును పాటించాల్సిన ఈసీ.. అందుకు విరుద్ధంగా నిబంధనలకు సవరణ చేయడం విడ్డూరమని ఆ సందర్భంలో ఆయన వ్యాఖ్యానించారు.

## భక్తులకు అలర్ట్... టీటీడీ కీలక నిర్ణయాలు

మొదటి పేజీ తరువాయి

తిరుమల: తిరుమల అభివృద్ధిపై టీటీడీ పాలకమండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా టీటీడీ కార్యక్రమాలు నిర్వహించడానికి కమిటీ ఏర్పాటు చేసిందని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలో టీటీడీ ఆలయాలు నిర్మిస్తామని చెప్పారు. స్విమ్స్ హస్పిటల్‌కి జాతీయ హోదా కల్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తామని అన్నారు. తిరుమల పర్యటనలో భక్తుల ఆరోగ్య సమస్యలు గుర్తించి సేవలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులకు అందించే సేవలపై ఫీడ్‌బ్యాక్‌ను ఏపీ డిజిటల్ సహకారంతో స్వీకరించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు చెప్పారు. తిరుమలలో ఉన్న హెూటల్స్ టెండర్ల కేటాయింపులో మార్పులు చేస్తున్నామని అన్నారు. అన్నప్రసాదంలో అదనంగా 258 మంది సిబ్బంది నియమిస్తున్నట్లు ప్రకటించారు.. కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంప్రదాయ పాఠశాల నిర్వహణకు రూ. 2 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. తిరుమలలో నూతనంగా ఫుడ్ సేఫ్టీ విభాగాన్ని నియమించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. భక్తులు సౌకర్యార్థం క్యూ కాంప్లెక్స్ వద్ద రూ.3.6 కోట్లతో టాయిలెట్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఒంటిమిట్ట రామాలయంలో రూ. 42 లక్షలతో బంగారు కలశం ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమల..శారదా పీఠానికి కేటాయించిన మఠం లీజు రద్దు చేయడానికి నోటీసులు జారీ చేశామని అన్నారు. మఠం నిర్వాహకులు ఇచ్చే సమాధానం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు.

# విజయవంతంగా వందే భారత్ స్లీపర్ ట్రయల్ రన్..

మొదటి పేజీ తరువాయి

గ్వాలియర్: ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కింది. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ప్యాసింజర్ ట్రెయిన్‌ను విజయవంతంగా పరీక్షించారు. మధ్యప్రదేశ్‌లోని కజురహో-ఉత్తరప్రదేశ్‌లోని మహోబా రైల్వే స్టేషన్ల మధ్య రెండు రోజులపాటు ట్రయల్‌రన్ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం చెన్నై ఐసీఎఫ్ నుంచి కజురహో చేరిన వందేభారత్ స్లీపర్ రైలు.. శనివారం అక్కడి నుంచి మహోబాకు చేరుకున్నది. మరుసటి రోజు కజురహో నుంచి తిరిగి మహోబాకు వచ్చింది. ఎస్‌ఆర్‌డీవో ఆధ్వర్యంలో జరిగిన ఈ ట్రయల్ రన్‌లో రైల్వే టెక్నికల్ టీమ్‌తోపాటు, ఐసీఎఫ్ అధికారులు కూడా పాల్గొన్నారు. ఈసందర్భంగా కజురహోకు వెళ్తున్న సమయంలో గంటకు 115 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లిన రైలు.. తిరుగు ప్రయాణంలో 130 కి.మీ. వేగంతో నడిచింది. ఈ సందర్భంగా అధికారులు సాంకేతిక అంశాలను పరిశీలించారు. అయితే వందేభారత్ రైలును గంటకు 160 నుంచి 200 కి.మీ. స్పీడ్‌తో వెళ్లేలా తయారుచేశారు. కాగా ఈ రైలు వచ్చే ఏడాది అందుబాటులోకి తీసుకురావాలని ఇండియన్ రైల్వే భావిస్తున్నది. దీనికోసం పది రైళ్లను సిద్ధం చేస్తున్నది. వందే భారత్ స్లీపర్ రైలుకు చాలానే ప్రత్యేకలున్నాయి. విమానం తరహాలో ప్రయాణికులు ఈ రైలులో సౌకర్యాలుంటాయి. ఈ రైలు ముందు విలాసవంతమైన హెూటల్స్ సైతం దిగదుడుపేనని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ రైలు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లనున్నది. వందే భారత్ స్లీపర్ రైలులో ఒకేసారి 823 మంది ప్రయాణికులు ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. ఇందులో ఒక ఫస్ట్ ఏసీ కోచ్, నాలుగు సెకండ్ ఏసీ, 11 థర్డ్ ఏసీ కోచ్‌లు ఉంటాయి.



### గంటకు 160 కిలోమీటర్ల వేగంతో..

ఈ రైలు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. దాంతో ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనున్నది. రైలులో ఫైర్ సేఫ్టీతో పాటు ప్రతి బెర్త్ వద్ద అత్యవసర స్టాప్ బటన్స్ సైతం ఉంటాయి. ప్రయాణికులు సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు బెర్తులను మెరుగైన కుషన్‌తో ఏర్పాటు చేశారు. అప్పర్ బెర్తులు ఎక్కేలా మెట్లు ఏర్పాటు చేశారు. దాంతో ప్రయాణికులకు సరికొత్త అనుభవాన్ని అందించనున్నాయి. అలాగే, రైలులో అత్యాధునిక సేవలు అందించనున్నారు. బయో వాక్యూమ్ టాయిలెట్లు, టచ్ ఫ్రీ ఫిట్టింగ్‌లు, షవర్ క్యూబికల్స్, ఆటోమేటిక్ డోర్లు, జీపీఎస్ ఆధారిత డిస్‌ప్లేలు, ఛార్జింగ్ సాకెట్లు వంటి సౌకర్యాలు ఈ మరింత ఆకర్షణీయంగా ఏర్పాటు చేస్తున్నది. రైలులో ఆటోమేటెడ్ డోర్లు ఏర్పాటు చేశారు. టాయిలెట్‌లో ఎలాంటి బయటన్ నొక్కకుండానే నీళ్లు వస్తాయి. ఒక కోచ్ నుంచి మరో కోచ్‌లోకి వెళ్లేందుకు ఆటో మేటిక్ డోర్లు ఏర్పాటు చేశారు. ప్రతి కోచ్‌లో ఎమర్జెన్సీ టాక్ బ్యాక్ యూనిట్ సైతం ఉంటుంది.


### ప్రతి కోచ్‌లో సీసీ కెమెరాలు..

ప్రతి కోచ్‌లోనూ సీసీ కెమెరాలు ఉంటాయి. చార్జింగ్ పెట్టుకునేందుకు ప్రతి బెర్త్ వద్ద సాకెట్ ఉంటుంది. అలాగే, బెర్త్ వద్ద చిన్న లైట్ సైతం ఉంటుంది. దాంతో ఎవరైనా బుక్‌లు, పేపర్ చదువుకునేందుకు అవకాశం ఉంటుంది. సేఫ్టీ 'కవచ్' సిస్టమ్, బ్లాట్ ప్రూఫ్ బ్యాటరీ, 3 గంటల ఎమర్జెన్సీ బ్యాకప్ ప్రయాణీకుల భద్రతను నిర్ధారిస్తాయని రైల్వేశాఖ పేర్కొంది. అయితే, వందే భారత్ తొలి రైలు ట్రయల్ రన్ మధ్యప్రదేశ్‌లోని ఖజురహోలో జరుగనున్నది తెలుస్తున్నది. రైల్వే డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ పర్యవేక్షణలో ట్రయల్ జరుగనున్నది. రైలు స్థిరత్వం, వైబ్రేషన్, డైనమిక్ పనితీరును ట్రయల్స్‌లో అంచనా వేయనున్నారు.

# భారతమాత కన్న తెలంగాణ ముద్దుబిడ్డ.. శ్యామ్ బెనెగల్: కేసీఆర్

మొదటి పేజీ తరువాయి

విస్మరించబడిన మనుషుల సామాజిక నేపథ్యాలకు సినీమా రంగంలో సమాంతర స్థానం కల్పించి, సామాన్యుల జీవన ఇతివృత్తాలకు వెండితెర గౌరవం కల్పించిన గొప్ప దర్శకుడని, భరత మాత కన్న తెలంగాణ ముద్దు బిడ్డ శ్యామ్ బెనగల్ (బెనగల్ల శ్యామ్ సుందర్ రావు) అని కొనియాడారు. ఇటు తెలంగాణ జీవన నేపథ్యాన్ని, అటు దేశీయ సామాజిక సంస్కృతిక వైవిధ్యాన్ని ఇరుసుగా చేసుకుని, ఆలోచింప చేసేవిధంగా దృశ్యమానం చేస్తూ, డాక్యుమెంటరీలు సినిమాల రూపంలో వారందించిన సేవలను ఈ సందర్భంగా కేసీఆర్ స్మరించుకున్నారు. హైదరాబాద్ గడ్డ మీద పుట్టిన బిడ్డగా చలన చిత్ర రంగంలో తన కృషితో ప్రతిష్టాత్మక అవార్డులు సాధించి, భారతీయ సినిమాకు వన్నె తెచ్చిన శ్యామ్ బెనెగల్ తెలంగాణకు గర్వకారణం అని అన్నారు. దర్శక దిగ్గజం శ్యామ్ బెనెగల్ సోమవారం కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న 90 సంవత్సరాల శ్యామ్ బెనెగల్ సోమవారం సాయంత్రం ముంబైలోని వోక్‌హార్డ్ దవాఖానలో తుది శ్వాస విడిచినట్టు ఆయన కుమార్తె పియా బెనెగల్ ధ్రువీకరించారు. ఆయనకు భార్య నీనా బెనెగల్, కుమార్తె ఉన్నారు. అంకుర్, భూమిక, జునూన్, కలియుగ్, ఆరోహన్, త్రికాల్, సుస్మాన్, అంతర్‌నాద్, మండి, మంథన్ తదితర అనేక అవార్డు చిత్రాలకు శ్యామ్ బెనెగల్ దర్శకత్వం వహించారు. 1978లో వాణిశ్రీ, అనంతనాగ్‌లతో ఆయన తీసిన ఏకైక తెలుగు చిత్రం అనుగ్రహం 1979 బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు నోచుకుని విమర్శకుల ప్రశంసలు అందుకుంది. డిసెంబర్ 14న ఆయన మిత్రులు, కుటుంబ సభ్యులతో కలసి తన 90వ పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. 1976లో పద్మశ్రీ అవార్డు, 1991లో పద్మ భూషణ్ అవార్డుతో భారత ప్రభుత్వం ఆయనను గౌరవించింది. ఆయన దర్శకత్వం వహించిన విజయవంతమైన చిత్రాలలో మంథన్, జుబేదా, సర్దారీ బేగం కూడా ఉన్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ రచించిన డిస్కవరీ ఆఫ్ ఇండియా ఆధారంగా దూరదర్శన్ కోసం ఆయన రూపొందించిన భారత్ ఏక్ ఖోజ్ డాక్యుమెంటరీ దేశవ్యాప్తంగా ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. 1934 డిసెంబర్ 14న హైదరాబాద్‌లో జన్మించిన శ్యామ్ బెనెగల్ కొంకణీ మాట్లాడే చిత్రపూర్ సారస్వత్ బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు. కర్ణాటకకు చెందిన శ్యామ్ బెనెగల్ తండ్రి శ్రీధర్ బీ బెనెగల్ ఫొటోగ్రాఫర్ కావడంతో కెమెరా పట్ల శ్యామ్‌కు చిన్నప్పటి నుంచే ఆసక్తి ఏర్పడింది. తన 12వ ఏట తన తండ్రి బహుమతిగా ఇచ్చిన కెమెరాతో శ్యామ్ బెనెగల్ తన మొదటి చిత్రాన్ని తీశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ పొందిన ఆయన హైదరాబాద్ ఫిల్మ్ సొసైటీని స్థాపించి తన సినీ ప్రయాణానికి బాటలు వేసుకున్నారు. ఆయన దర్శకత్వం వహించిన చిత్రాలలో అంకుర్, మంథన్, మండి, నేతాజీ సుభాష్ చంద్ర బోస్: ది ఫర్‌గాటెన్ హీరో, జుబేదా, వల్ డన్ అబ్బా వంటివి అంతర్జాతీయంగా పేరు గడించాయి. ఆయన దర్శకత్వం వహించిన అనేక చిత్రాలు జాతీయ అవార్డులను గెలుచుకున్నాయి. తన 90వ జన్మదినానికి ముందు బెనెగల్ మాట్లాడుతూ తాను మూడు, నాలుగు ప్రాజెక్టులపై చర్చలు జరుపుతున్నానని చెప్పడం విశేషం.





# హలో ఆంధ్రా...



మొదటి పేజీ తరువాయి

గ్రీన్ హైడ్రోజన్ హబ్, ఆర్సెలర్ స్టీల్ ప్లాంట్.. సహా మరి కొన్ని అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో కలిసి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టనున్నారు. హలో ఆంధ్రా.. అనకాపల్లిలో మరోసారి ప్రధాని ఆవాజ్ వినిపించనుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా మార్చి 8న అనకాపల్లిలో పర్యటించారు ప్రధాని మోదీ. ఉమ్మడి విశాఖ జిల్లా అభివృద్ధికి కీలక హామీలను ఇచ్చారు కూడా. ఇటీవల నవంబర్ నెల 29వ తేదీన ప్రధాని మోదీ విశాఖలో పర్యటించాల్సి ఉంది. కానీ ప్రతికూల వాతవారణం వల్ల పర్యటన రద్దయింది. అయితే, జనవరి 8న ప్రధాని మోదీ అనకాపల్లి వస్తున్నారని బీజేపీ ఎంపీ సీఎం రమేష్ ప్రకటించారు. సోమవారం డిసెంబర్ 23 రోజున కసింకోటలో 4.53 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు స్పీకర్ అయ్యన్నపాత్రులతో కలిసి ఎంపీ సీఎం రమేశ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనకాపల్లి జిల్లా పర్యటనపై ప్రకటన చేశారు. గ్రీన్ హైడ్రోజన్ హబ్, ఆర్సెలర్ స్టీల్ ప్లాంట్ సహా మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రధాని పాల్గొంటారన్నారు ఎంపీ సీఎం రమేష్. అనకాపల్లి జిల్లాలో అల్యూమినియం కొత్త ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. పుడిమడకలో ఎన్టీపీసీ, ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో గ్రీన్ హైడ్రోజన్ హబ్, నక్కపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ నిర్మాణాలకు శంకుస్థాపన చేసేందుకు ఇటీవల సిద్ధం చేశారు. కీలకమైన ఈ ప్రాజెక్టులు నిర్మాణం ద్వారా అనకాపల్లి యువతకు వేలాది ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. అలాగే అనకాపల్లి జిల్లాలో మూడు కేంద్రీయ విద్యాలయాలయాలు రాబతున్నాయన్నారు. అల్యూమినియం కొత్త ప్లాంట్ ఏర్పాటుకు భూసేకరణ పై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి జరుగుతుందని అన్నారు ఎంపీ సీఎం రమేష్. జనవరి 8వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనకాపల్లిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారన్నారు.

## కష్టాలనేవి శాశ్వతం కావు..
## 2027 చివర్లో జమిలి ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి



పులివెందుల పర్యటనలో భాగంగా.. కడప నేతలు, కార్పొరేటర్లతో తాజా పరిణామాలపై ఆయన చర్చించారు. "కష్టాలు అనేవి శాశ్వతం కావు. కష్టాలు వచ్చినప్పుడు వ్యక్తిత్వాన్ని అమ్ముకోకూడదు.మనమందరం కలిసికట్టుగా పని చేయాలి. దేశ చరితలో ఏ ఒక్కరూ చేయని మంచి పనులు చేశాం. అబద్ధాలు చెప్పలేకపోవడంతోనే ప్రతిపక్షంలో ఉన్నాం. మోసపూరిత హామీలతో చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. కానీ, ..మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేసే సంప్రదాయాన్ని మనం మార్చాం. కోవిడ్ సమయంలో కూడా సంక్షేమాన్ని ఆపలేదు. కార్యకర్తలు కాలర్ ఎగరేసుకునేలా పాలన చేశాం. 2027 చివరిలో జమిలి ఎన్నికలు రావొచ్చు. మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే. ప్రతికార్యకర్తకు అండగా ఉంటాం" అని అన్నారాయన. ఈ కార్యక్రమంలో.. ఆంజాద్ బాషా, కడప మేయర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. పార్టీ కార్యక్రమాలతో పాటు ఇటీవల కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను కడప నాయకులు వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. కార్పొరేషన్లలో బలం లేకపోయినా టీడీపీ నేతలు పెత్తనం కోసం ఎలా పాకులాడుతున్నారో తమ అధినేతకు వివరించారు. "మాట మీద నిలబడితే ప్రజలు వాస్తవాలను తెలుసుకుని ఆదరిస్తారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా నిత్యం మనం ప్రజల కోసమే పోరాడాలి" అని నేతలకు వైఎస్ జగన్ సూచించారాయన.

## అంబేద్కర్‌ను మానసిక క్షోభకు గురిచేసింది కాంగ్రెస్సే

మొదటి పేజీ తరువాయి

**న్యూఢిల్లీ,:** కేంద్ర హెూంమంత్రి అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను అవమానించారని, మంత్రి పదవికి ఆయన రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై బీజేపీ, హస్తం పార్టీలు పరస్పర విమర్శలు గుప్పించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. బీఆర్ అంబేద్కర్‌ను రెండు పర్యాయాలు ఎన్నికల్లో ఓడించి పార్లమెంట్‌లో అడుగు పెట్టనీయకుండా కాంగ్రెస్ పార్టీయే ఆయనను మానసిక క్షోభకు గురిచేసిందని పురందేశ్వరి ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాతను తీవ్రంగా అవమానించారని ఆమె మండిపడ్డారు. అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని గౌరవిస్తున్న పార్టీ బీజేపీ అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని పురందేశ్వరి అన్నారు. వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ఆయనకు 'భారతరత్న' అవార్డ్ ప్రకటించామని ఆమె ప్రస్తావించారు. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనపై స్పందించిన పురందేశ్వరి ... థియేటర్ వద్ద మరింత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసి ఉంటే ప్రమాదం జరిగి ఉండేది కాదన్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరగాలన్నారు. ఏపీలో 25 లక్షలకు పైగా బీజేపీ సభ్యత్వాలు నమోదవుతున్నాయని ఆమె వెల్లడించారు. రాజమహేంద్రవరంలో మీడియాతో పురందేశ్వరి మాట్లాడారు.

## 2007 నాటి కేసులో విజయవాడ కోర్టుకు
## హాజరైన ఏపీ, తెలంగాణ నేతలు

మొదటి పేజీ తరువాయి

**అమరావతి,:** ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ నాయకులు విజయవాడలో కలిశారు! ఉమ్మడి ఏపీలో 2007లో ఓబులాపురం మైనింగ్ పరిశీలనకు వెళ్లిన నేతలపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి ఈరోజు విజయవాడలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది. కోర్టు తదుపరి విచారణను వచ్చే జనవరి 8కి వాయిదా వేసింది. నాడు 21 మందిపై కేసు నమోదు కాగా, ముగ్గురు విచారణ దశలో మృతి చెందారు. మిగిలిన వారంతా విచారణకు హాజరు కావాలని కోర్టు ఇదివరకే ఆదేశించింది. దీంతో అభియోగాలు ఎదుర్కొంటున్న ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు నాగం జనార్దన్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకరరావు, దేవినేని ఉమామహేశ్వరరావు, చినరాజప్ప, పడాల అరుణ, అమర్నాథ్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, చిన్నం బాబు రమేశ్, కోళ్ల లలిత కుమారి, బొమ్మడి నారాయణరావు, మసాల పద్మజ, పూల నాగరాజు, ముల్లంగి రామకృష్ణారెడ్డి, గురుమూర్తి, మెట్టు గోవింద్ రెడ్డి, యలమంచిలి బాబూ రాజేంద్రప్రసాద్ న్యాయాధికారి ఎదుట హాజరయ్యారు. ఇందులో ఎర్రబెల్లి దయాకరరావు, నాగం జనార్దన్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి తెలంగాణకు చెందిన వారు. కేసు విచారణలో భాగంగా విజయవాడకు వచ్చిన వారు తమ పాతమిత్రులను ఆప్యాయంగా పలకరించారు. వీరంతా అప్పుడు టీడీపీలో ఉన్నారు. 2007 జులై 21న అనంతపురం జిల్లా డి.హీరేహాల్ మండలంలోని ఓబులాపురం గనుల పరిశీలనకు వెళ్లారు. దీంతో వారిపై నాడు పోలీసు కేసు నమోదైంది. తమపై తప్పుడు కేసు బనాయించారని, తాము ఎక్కడా నేరానికి పాల్పడలేదని న్యాయాధికారి ప్రశ్నలకు వారు వివరణ ఇచ్చారు.


## అల్లు అర్జున్‌ను... ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తా

**సినిమా పెద్దలను కూడా కలుస్తానన్న దిల్ రాజు**

**సీఎంను మరోసారి కలిసి ఇండస్ట్రీ అభిప్రాయం చెబుతానని వెల్లడి**

**ప్రభుత్వానికి, పరిశ్రమకు వారధిలా పని చేస్తానన్న దిల్ రాజు**

**రేవతి భర్తకు శాశ్వత ఉపాధి కల్పిస్తామని హామీ**



హైదరాబాద్: తాను అల్లు అర్జున్‌ను కలుస్తానని, అలాగే చిత్ర పరిశ్రమ పెద్దలను కూడా కలుస్తానని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, సినీ నిర్మాత దిల్ రాజు అన్నారు. ఆ తర్వాత సీఎంను కలిసి చిత్ర పరిశ్రమ అభిప్రాయం చెబుతానని తెలిపారు. ఈరోజు సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి వెళ్లి శ్రీతేజ్ ను పరామర్శించారు. వైద్యులను అడిగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం దిల్ రాజు మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి తనను ఎఫ్‌డీసీ చైర్మన్‌గా నియమించారని, అమెరికాలో ఉన్నందున ఇన్ని రోజులు ఆయనను కలవలేకపోయానన్నారు. అమెరికా నుంచి రాగానే సీఎంను కలిసినట్లు చెప్పారు. అల్లు అర్జున్ సహా సినిమా పెద్దలను కలుస్తానని... అనంతరం పరిశ్రమ అభిప్రాయాన్ని రేవంత్ రెడ్డికి చెబుతానన్నారు. ఇందుకోసం రేపు లేదా ఎల్లుండి సీఎంను మరోసారి కలుస్తానన్నారు. తాను ప్రభుత్వాన్ని, సినీ పరిశ్రమను సమన్వయం చేస్తానన్నారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో రేవతి మృతి చెందడం బాధాకరమన్నారు. ఆమె కుటుంబానికి చిత్ర పరిశ్రమ, ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ ఘటనను ఎవరైనా కావాలని చేస్తారా? రేవతి కుటుంబం వినోదం కోసం సినిమాకు వెళితే ప్రమాదవశాత్తు ఇలా జరిగిందని ఆవేదన చెందారు. రేవతి భర్త భాస్కర్‌కు శాశ్వత ఉపాధిని కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. సినిమా పరిశ్రమలో శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. చిత్ర పరిశ్రమను ప్రభుత్వం దూరం పెడుతుందనేది దుష్ప్రచారం మాత్రమే అన్నారు. చిత్ర పరిశ్రమకు అన్ని విధాలుగా అండగా ఉంటామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. త్వరలో సీఎంను కలిసి అన్ని విషయాలపై చర్చిస్తామన్నారు. ఎలాంటి సమస్య రాకుండా చూసే బాధ్యత తనదే అన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్ వేగంగా రికవరీ అవుతున్నాడని తెలిపారు.

## సత్యన్నసేన ఆధ్వర్యంలో గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ



తనకల్లు, మండల రిపోర్టర్ - రవీంద్ర (శుభోదయం న్యూస్): శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం కొక్కంటి క్రాస్ సత్యన్న సేన సభ్యుల అధ్వర్యంలో ఈరోజు అయిదుగురు గర్భిణీ స్త్రీల కు ఆరు రకాల పౌష్టిక ఆహారాన్ని అందజేయడం జరిగింది.కరోనా సమయంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఆ తర్వాత క్రమం ఇప్పటికీ 30 నెలలు గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. తరువాత కూడా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ దానికి కొనసాగింపుగా వీరికి ప్రతి నెలా అమృత పౌష్టిక ఆహారాన్ని డెలివరీ అయ్యేవరకు అందజేయడం జరుగుతుంది. ప్రతి నెలా కొక్కంటి క్రాస్ ప్రాంతంలో ఉన్న నిరుపేద గర్భవతులకు నెలలు నిండేవరకు సత్యన్న సేన ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి స్ఫూర్తి ప్రధాత అయిన సత్యకుమార్ యాదవ్ కు నిరుపేద గర్భిణీ స్త్రీలు ధన్యవాదాలు తెలియజేశారు.

## అనుమానిత గ్రామాలలో వరసదాడులునిర్వహిస్తాం : ఎక్సైజ్ సహాయ సూపరింటెండెంట్ రమేష్



బిట్రగుంట (శుభోదయం న్యూస్) : శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లాఅబ్కారీశాఖ ఉన్నత అధికారుల ఆదేశాలమేరకు రాబోవు పండుగ రోజులలోనాటు సారాతయారీ, రవాణా, అమ్మకాలు ఇతర ప్రొహిబిషన్ మరియుఎక్సైజ్ నేరముల నియంత్రణకు దాడులునిర్వహించి, మత్తుపదార్థముల వినియోగం వలన కలిగే అనర్థాలపై ప్రజలకు



అవగాహన కలిగించినట్లు నెల్లూరుఅసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జే.రమేష్ మంగళవారంబోగోలులోతెలిపాడు బోగోలుమండలంలోని అనుమానితగ్రామాలైన కప్పరాళ్ళతిప్ప, బోగోలు, చెంచు లక్ష్మీపురం, నాగులవరం, సోమేశ్వరపురంగ్రామాలలో గాలింపుచర్యలుచేపట్టామని, అవసరాన్నిబట్టి ఆయాగ్రామాలలో వరుసదాడులు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగానిర్వహించనున్న నవోదయం 2 లోభాగంగా, ఆంధ్రప్రదేశ్ ను "సంపూర్ణసారారహితఆంధ్రప్రదేశ్" గామార్చేందుకు జనవరిమొదటివారంనుండి మూడుదశలుగాకార్యక్రమాలు నిర్వహిస్తామని, మొదటిగా సందేహాత్మకగ్రామాలలో గ్రామసభలద్వారాఅవగాహన కలిగించడం, పాతనేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించడం, దశలవారీగాకాపుసారా నిర్మూలించడంవంటి కార్యక్రమాలుచేపడుతామన్నారు. పైకార్యక్రమంలో నెల్లూరుఎన్ఫోర్స్మెంట్ వింగ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జగదీశ్వర్ రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్ శీనుబాబు, ఎస్ఐ కేవిఆర్. ఆంజనేయులు, బుచ్చిరెడ్డిపాలెం ఇంచార్జ్ సిఐ జలీల్ ఖాన్, కావలిసర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్ఐ దేవిక, కోవూరుఎస్ఐ మరియువారిసిబ్బంది పాల్గొన్నారు.

## క్రిస్మస్ పండగ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఇంటూరి



కందుకూరు, అర్సీ ఇంచార్జ్ - శ్రీకాంత్ (శుభోదయం న్యూస్):కందుకూరు నియోజకవర్గం ప్రజలకు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.పేమ, కరుణ, జాలి, దాతృత్వం, త్యాగం ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలు. మానవులు వాటిని అనుసరిస్తూ సత్యపథం వైపు నడిచేలా యేసుక్రీస్తు మార్గ నిర్దేశం చేశారు. ఈ క్రిస్మస్ ద్వారా ప్రజలందరూ కరుణామయుని ఆశీస్సులు, దీవెనలు పొందాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆకాంక్షించారు.

## ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు: మాజీ ఎమ్మెల్యే కదిరి



పామూరు, మండల రిపోర్టర్ – బండి రమేష్ (శుభోదయం న్యూస్): క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవులందరికీ మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు శుభాకాంక్షలు తెలిపారు. కరుణ, ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం.. ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలని కదిరి బాబురావు పేర్కొన్నారు. తద్వారా, మానవాళిని సత్యపథం వైపు నడిపించేలా ఏసుక్రీస్తు మార్గనిర్దేశం చేశారని చెప్పారు.దుర్మార్గం నుంచి సన్మార్గానికి, అమానుషత్వం నుంచి మానవత్వానికి, చెడు నుంచి మంచికి, దురాశ నుంచి దాతృత్వం, త్యాగాలకు జీసస్ బాటలు వేశారని తెలిపారు.క్రీస్తు బోధనలు మనుషులందరినీ ఎప్పటికీ సన్మార్గంలో నడిపిస్తాయని పేర్కొన్నారు.

## మసీదు నిర్మాణానికి రెండు లక్షలు విరాళం అందజేసిన మస్తాన్ వలి



తనకల్లు, మండల రిపోర్టర్ - రవీంద్ర (శుభోదయం న్యూస్): కదిరి నియోజకవర్గం తనకల్లు మండలంలోని ముతవల్లి ఇమామ్ మోజోన్ల కలయికలో కొర్తికోట టిడిపి మాజీ సర్పంచ్ ఎస్ కె మస్తాన్ వలి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన కొండ వెనుక పల్లె గ్రామంలో మసీదు నిర్మాణము మరియు డెవలప్మెంట్ కొరకు రెండు లక్షల రూపాయలు విరాళముగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తనకల్లు మండలం ముస్లిం మత పెద్దలు అందరూ పాల్గొన్నారు.

## క్రీస్తు ఆరాధనలకు మేల్కొలుపు - క్రిస్మస్ గంటలు మోగినవి.. క్రీస్తుని జననం చాటినవి



రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : క్రైస్తవుల పండుగల్లో క్రిస్మస్ పండుగ అతి ముఖ్యమైనది. క్రీస్తు జన్మదినాన్ని క్రైస్తవులు క్రిస్మస్ గా జరుపుకుంటారు. లోక రక్షకుడి జన్మదినం మహిమాన్వితమైనదని, పవిత్రమైనదని విశ్వాసం. 'రక్షకుడు ఉదయించాడు.. దావీదు వంశమున ధన్యుడు జన్మించాడని' అంటూ ప్రత్యేక ప్రార్థనలు జరుపుకుంటారు. క్రిస్మస్ సీజన్లో చాలా చోట్ల వీధులను కాంతివంతం చేస్తూ విద్యుత్ నక్షత్రాలు వెలుగుతుంటాయి. ఆకుపచ్చని చెట్లకు రంగురంగుల అలంకరణలతో క్రిస్మస్ ట్రీలు మెరుస్తూ శోభనిస్తాయి. శీతల వేళ మంచు కురిసే వేళలో క్రీస్తు ఆరాధనకై ప్రార్థనమందిరాల్లో మోగించే గంటల సవ్వడి, కనువిందుగా ప్రకాశిస్తూ భక్తులను ఆహ్వానించే క్రీస్తు మందిరాలతో క్రిస్మస్ పండుగ శోభల్లితుంది. దీపాలు, చెట్టు, నక్షత్రం, గంటలు రక్షకుని పుట్టుక సంకేతాలుగా క్రిస్మస్ విశిష్టతను చాటి చెప్పే చిహ్నాలు. క్రిస్మస్ ఆరాధన సాంప్రదాయ అలంకరణలో వీటికి ఎంతో ప్రాధాన్యత ఉంది. క్రిస్మస్ సీజన్ రాకను ప్రకటించడానికి గంటలు మోగించబడతాయి. ప్రభు సన్నిధికి తాము వెళ్లే సమయాన్ని సూచిస్తున్నందున గంటకు ప్రత్యేకత ఏర్పడింది. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని గంటలు మోగించటం ఆరాధనకు పిలుపు. ఏసుక్రీస్తు అర్ధరాత్రి జన్మించాడనే నమ్మికతో అర్ధరాత్రి ముందు గంటలో నాలుగు సార్లు గంట మోగించటం, అర్ధరాత్రి అన్ని గంటలు వేడుకగా మోగించటం సాంప్రదాయంగా ఉంది. అలాగే గృహాల్లో, దేవాలయాల్లో నక్షత్రాలు వేలాడుతూ ఉంటాయి. రక్షకుని పుట్టుకను సూచించే నక్షత్రం జ్ఞానులను బాల యేసు వద్దకు నడిపించింది. జ్ఞానులు నక్షత్రం యొక్క కాంతిని అనుసరించినట్లే రక్షకుని కాంతిని అనుసరించాలని మనకు నక్షత్రం గుర్తు చేస్తోంది. క్రిస్మస్ దీపాలు ఏసుప్రభువు ప్రపంచానికి వెలుగు అని మనకు గుర్తు చేస్తాయి. ఆరాధనలో భాగంగా వెలిగించే కొవ్వొత్తుల వెలుగులో మనం ప్రకాశింపబడి ,ఇతరులకు వెలుగుగా ఉండాలని మనల్ని సూచిస్తోంది. ఇక చెట్లు క్రీస్తు జననానికి ప్రత్యేక అర్థాన్ని కలిగి ఉన్నాయి. చలికాలంలో పచ్చగా వర్ధిల్లుతున్న చెట్టు ప్రజలకు సరికొత్త ఆశ, కొత్త జీవితాన్ని గుర్తుచేస్తుంది. క్రీస్తు జన్మదినాన్ని బుధవారం మండల వ్యాప్తంగా క్రైస్తవులు భక్తి ప్రపత్తులతో జరుపుకోనున్నారు.మండల కేంద్రమైన రెంటచింతలలోని కానుక మాత దేవాలయం, చర్చిలతో పాటు వివిధ ప్రార్థన మందిరాలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. కానుకమాత దేవాలయంలో మంగళవారం అర్ధరాత్రి 11 గంటల నుంచే క్రిస్మస్ ఆరాధనలు నిర్వహిస్తారు. ప్రత్యేకమైన క్రీస్తు స్తుతి గీతాలు పాడుతూ, క్రీస్తు జన్మ వృత్తాంతానికి సంబంధించిన సందేశాన్ని చాటుతారు. దివిని విడిచి భువిపై మనకై సామాన్య మానవునిగా జన్మించి ప్రేమ, త్యాగం, కరుణ విలువలను చాటి చెప్పిన యేసు సందేశం వాడ వాడాలా మార్మోగనుంది. ప్రపంచానికి వెలుగుగా ఉన్న క్రీస్తు జననాన్ని నేడు మనం స్మరించుకుంటే మనలో కొత్త కాంతి ప్రకాశిస్తుంది. కరుణామయుడు ప్రబోధించిన దయ, కరుణ, క్షమాగుణం చర్యల ద్వారా ఏసుప్రభు యొక్క కాంతిని పంచుకోవడానికి శాంతికర్తలుగా ఉండి ఆయనను అనుసరిస్తూ క్రీస్తు వెలుగును ప్రతిబింబించే వారిగా మనం నిజమైన ఆరాధన చేయడానికి హృదయాలను పరిశుద్ధతతో సిద్ధపరచుకుందాం. లోకానికి దారి చూపే వెలుగు పుట్టిన శుభదినాన ఆ వెలుగును ఆహ్వానిద్దాం.. ఆస్వాదిద్దాం.. సామూహికంగా ఆరాధిద్దాం. ఏసుప్రభువు అందించిన ప్రేమ సూత్రాన్ని మనం గ్రహించి క్రీస్తు ప్రేమను పదిమందికి పంచగలిగామా? అని మనం ప్రశ్నించుకున్నప్పుడే క్రిస్మస్ పండుగకు అర్థం, పరమార్థం ఉంటాయి. లేదంటే మనం ఎంతగానో ఎదురు చూస్తున్నా క్రిస్మస్ కాంతులు కళ్ళెదుటే కరిగిపోతాయి.

## బొందిమడుగులలో పారిశుద్ధ్య పనులు చేయించిన గ్రామ సర్పంచ్ యండ చౌడప్ప..



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్): మండలం పరిధిలోని బొంది మడుగుల గ్రామంలోని గ్రామ సర్పంచ్ యండ.చౌడప్ప ఆద్వర్యంలో గ్రామ సర్పంచ్ సలహా దారులు ఎస్.ప్రతాప్ యాదవ్ గ్రామంలోని స్థానికంగా ఉన్న వీధులలో ఎన్నో రోజుల నుంచి పేరుకు పోయిన మురుగు నీటిని,మురుగు నీటి లోని చెత్త చెదారాన్ని మొత్తం పారిశుద్ధ్య పనులు చేయించడం జరిగింది. ఈ సందర్భంగా బొంది మడుగుల గ్రామ సర్పంచ్ సలహా దారులు ఎస్.ప్రతాప్ యాదవ్ మాట్లాడుతూ పత్తికొండ ఎమ్మెల్యే కెయి శ్యామ్ కుమార్ ఆదేశాల మేరకే ఇటీవల కాలంలో గ్రామంలో ఉన్న మురుగు నీరు డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయించడం పూర్తయిందని గ్రామ పరిశుభ్రత ముఖ్యమని,గ్రామంలోని ప్రజలు వారి ఇంటి చుట్టూ ప్రక్కల ఉన్న పరిసరాలను ఎల్లప్పుడూ పరి శుభ్రంగా ఉంచుకుంటూ పారిశుద్ధ్య కార్మికులకు పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రజలు వారికి పూర్తి సహాయ సహకారాలు అందజేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చిన్న వెంకటేశ్వర్లు.గ్రామ ప్రజలు,పారిశుద్ధ్య కార్మికులు రాజ శేఖర్.మద్దిలేటి.సామేలు తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లాలో రజక ధోబిగాట్లను సందర్శించిన రజక చైర్మన్ శ్రీమతి సావిత్రి.....



కర్నూలు, (శుభోదయం న్యూస్): కర్నూలు జిల్లాలో ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీమతి సావిత్రి సందర్శించడం జరిగింది. రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. వారు నిర్వహించే ధోబి గాట్ల గురించి పలు సలహాలు, సూచనలు చేశారు. త్వరలో అన్ని జిల్లాల పర్యటనలో రజకులు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కరించే దిశగా తమ అడుగులు ఉంటాయని సావిత్రి చెప్పడం జరిగింది..ప్రతి జిల్లాలో రజకుల ఐకమత్యంగా ఉండి ముందుకెళ్లాలని సూచించారు.నూతన టెక్నాలజీని ఉపయోగించుకుంటే సమయం ఆదా అవుతుందని వారికి సూచించారు.చైర్మన్ సావిత్రితో పాటు రజక కుల సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

## క్రైస్తవ సోదర, సోదరీమణులకు క్రీస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బుర్రా మధుసూదన యాదవ్



కందుకూరు, అర్సీ ఇంచార్జ్ – శ్రీకాంత్ (శుభోదయం న్యూస్): మహిమాన్వితమైన పరిశుద్ధుడు క్రీస్తు జన్మదినం లోకానికి వెలుగును తీసుకువచ్చిందని తోటి వారి పట్ల ప్రేమ, కరుణ కలిగి జీవించాలని క్రిస్మస్ పర్వదినం సందర్భంగా కందుకూరు నియోజకవర్గ క్రైస్తవ సోదర, సోదరీమణులకు వైఎస్ఆర్సిపి ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ క్రిస్మస్ శుభములు తెలియజేశారు.సంతోష, ఆనందోత్సవాలతో క్రీస్తు జన్మదినాన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు.ప్రపంచానికి వెలుగు పంచిన క్రీస్తు జన్మదినం మానవాళికి పండుగ లాంటిదని అన్నారు. ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు.

## పోలినేనిపాలెం గ్రామ పంచాయతీలో....

### అనుమోలు అమరేశ్వరి సుబ్బారావు దంపతుల ఆధ్వర్యంలో వీధిలైట్లు మరమ్మత్తులు



కందుకూరు, అర్సీ ఇంచార్జ్ - శ్రీకాంత్ (శుభోదయం న్యూస్): వలేటివారిపాలెం మండలం పోలినేనిపాలెం గ్రామం నందుగత నెలలో కురిసిన వర్షాలకు వీధిలైట్లు వెలగడం లేదు, ఈ సమస్య ను గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి మరమ్మత్తులు చేయించారు. సమస్య ను పరిష్కారం చేసి నందుకు గ్రామస్తులు సర్పంచ్ కు అభినందనలు తెలియజేశారు.

## టి నాయుడుపాలెం జమ్ములపాలెం చెరువులను పరిశీలించిన - మంత్రి డోల సంబంధిత అధికారులు!



టంగుటూరు మండల రిపోర్టర్ :- వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- మండల పరిధిలోని తూర్పు నాయుడుపాలెం గ్రామంలో గల చెరువును రాష్ట్ర సంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి బుధవారం సందర్శించి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గా తీసుకున్న అమృత సరోవర్ పథకం కింద అభివృద్ధి



చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా జమ్ములపాలెం గ్రామంలో అమృత్ సరోవర్ వాటర్ ట్యాంక్ పరిశీలనార్థం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి జోసెఫ్ కుమార్ సందర్శించడం జరిగింది. చెరువు పూడికతీత వాకింగ్ ట్రాక్ మొక్కల పెంపకం తదితర అంశాల గురించి సంబంధిత అధికారులతో చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటస్వామి ఉపాధి హామీ అధికారి మారెళ్ళ సుభాషిని ఉపాధి హామీ సచివాలయ సిబ్బంది గ్రామ నాయకులు మక్కెన వెంకట్రావు రమేష్ ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## కందుకూరు పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

### ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

### అధికారులు, వార్డు సచివాలయ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేయాలి



కందుకూరు, అర్సీ ఇంచార్జ్ - శ్రీకాంత్ (శుభోదయం న్యూస్):కందుకూరు పట్టణం లోని పురపాలక సంఘ కార్యాలయం లో మంగళవారం సాయంత్రం 5 గంటలకు మునిసిపల్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది..ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డు సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వానికి ప్రజల్లో మంచి పేరు తీసుకురావాలని సూచించారు.వార్డుల్లో మౌలిక వసతులైన నూతన రోడ్లు కాలువల కొరకు అంచనాలు తయారు చేయాలని అధికారులకు ఆదేశించారు.. ప్రజలకు సురక్షితమైన త్రాగు నీరు అందించాలని, వీది దీపాల నిర్వహణ, ముఖ్యంగా పట్టణంలో పారిశుద్ధ్య పనులను సకాలంలో పూర్తి చేయాలని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా



జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు తెలియజేశారు..ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేయటం లో అలసత్వం వహించవద్దని ప్రజల నుండి సచివాలయాలకు వచ్చే అర్జీలను త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.పట్టణం లో వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేయుటకు కొనుగోలు చేసిన నూతన ట్రాక్టర్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ కొర్రపాటి అనూష మున్సిపల్ డిఈ గణపతి అన్ని విభాగాల అధిపతులు, సిబ్బంది వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.య

## ప్రేమ, కరుణ అంటే జీసస్ గుర్తుకొస్తారు

### ఎం జయకుమార్, అధినేత సెయింట్ మార్క్స్ విద్యాసంస్థలు



ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ సెయింట్ మార్క్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ముందస్తు క్రిస్మస్ వేడుకలు ప్రారంభమైనవి. క్రిస్మస్ ప్రపంచ పండుగని పాఠశాల అధినేత జయకుమార్



కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు యేసుక్రీస్తు, క్రిస్మస్ తాత వేషధారణలతో అలరించారు. ఉపాధ్యాయులు యేసు జననం తెలియజేసే పశువులపాకను అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. అధినేత జయకుమార్ మాట్లాడుతూ యేసు పుట్టుకతోనే నూతన శకం ప్రారంభమైనదని,ఆయన సర్వవ్యాపకుడని ప్రజల కోసం ప్రాణాలను త్యాగం చేసి పునరుజ్జీవనం అయిన యేసు మానవ అవతారంలో భూమిపైకి వచ్చిన దేవుడని, మనమందరం ఆయన బిడ్డలం అని తెలియజేశాడు. యేసు మార్గం అనుసరించడం వలన శాంతి, సహనం, అలవడుతాయని, అందరం ఆయన సూచించిన శాంతియుత మార్గం పాటించాలని తెలియజేశాడు.ఇందులో పాఠశాల అధినేత జయ కుమార్ సతీమణి ఎలిజబెత్ రాణి, కుటుంబ సభ్యులు, మోహన్ రావు సార్,ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ నలంద పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు



సిద్ధవటం, మండల విలేకరి జాకీర్ హుస్సేన్(శుభోదయం న్యూస్): డిసెంబర్ 25వ తేదీన క్రిస్మస్ పండుగ సందర్భంగా శ్రీ నలంద పాఠశాలలో సెమీ క్రిస్మస్వేడుకలు నిర్వహించామని పాఠశాల కరస్పాండెంట్ బాలు గారి వెంకటసుబ్బయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాస్టర్ దేవిడ్ విజయానంద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వీరు మాట్లాడుతూ జీసస్ యొక్క జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం డిసెంబర్ 25వ తేదీన దేశవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటారని వారన్నారు.జీసస్ యొక్క జీవన విధానము మరియు వారు ప్రజలకు చెప్పినటువంటి సూక్తులను వివరించారు. అలాగే కేక్ ను కూడా కట్ చేయడం జరిగింది. నలంద పాఠశాల విద్యార్థులు చేసినటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థిని విద్యార్థులను ఆకట్టుకున్నాయని అన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు లలిత ,బాబు, వైశాలి తదితర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బి.ఆర్.ఆక్స్ ఫర్డ్ స్కూల్ లో ఆకట్టుకున్న"సెమీ క్రిస్మస్" వేడుకలు






కందుకూరు, అర్బీ ఇంచార్జ్ – శ్రీకాంత్ (శుభోదయం న్యూస్):స్థానిక కందుకూరు పట్టణం లోని పామూరు రోడ్ లో గల బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ ఒలంపియాడ్ స్కూల్ నందు మంగళవారం ముందస్తుగా క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.బాల,బాలికలు క్రిస్మస్ తాత,తదితర వేషధారణ లతో అలరించారు.అనంతరం ఉల్లాసంగా నృత్యాలతో సందడి చేశారు.ఈ సందర్భంగా బి.ఆర్.ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ..ప్రేమ,సోదరభావం,సామరస్యమే క్రీస్తు బోధనల సారమని, తోటి వారి పట్ల సానుభూతితో వ్యవహరించాలని భావనను అందరూ అలవర్చుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ఫాదర్ బాల సుందరం ఏసుక్రీస్తు బోధనలను గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి. బాల భాస్కరరావు, బి. నరేంద్రబాబు, పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## వైసిపి పోరుబాట
## వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన ఇన్చార్జి దద్దాల



కనిగిరి, రిపోర్టర్ జి.ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్): కనిగిరి వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో డిసెంబర్ 27వ తేదీ జరగనున్న వైసీపీ పోరుబాట కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ ను కనిగిరి వైసీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కరెంటు చార్జీలా పై బాదుడు మొదలైందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఐదు నెలల కాలంలో ప్రజలపై సుమారు 15 వేల కోట్ల రూపాయల కరెంటు చార్జీల పెంపు భారాన్ని ప్రజలపై పంపిందని అన్నారు. 27వ తేదీన నియోజకవర్గం పరిధిలోని రైతులు నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కనిగిరి జెడ్పిటిసి కస్తూరి రెడ్డి, పీసీపల్లి జడ్పిటిసి ఓకే రెడ్డి,పీసీపల్లి మండల పార్టీ అధ్యక్షులు బొర్రా రెడ్డి, హనుమంతునిపాడు మండల పార్టీ అధ్యక్షులు యక్కంటి శ్రీనివాసులు రెడ్డి, పీసి పల్లి మాజీ సింగల్ విండో చైర్మన్ జయరాం రెడ్డి, కనిగిరి సొసైటీ బ్యాంక్ మాజీ చైర్మన్ సూరసాని మోహన్ రెడ్డి, హనుమంతుని పాడు మండలం నాయకులు ఆదినారాయణ రెడ్డి, వెలిగండ్ల మండల నాయకులు పల్నాటి భాస్కర్ రెడ్డి, కనిగిరి పట్టణ నాయకులు డిష్ జిలాని, కనిగిరి మండల పార్టీ నాయకులు గోవర్ధన్ రెడ్డి, డాక్టర్ రసూల్,ఎంపీటీసీ కొండారెడ్డి,సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి,సర్పంచ్ స్వర్ణ ఏడుకొండల రెడ్డి,మాజీ సర్పంచి గొబ్బిళ్ల శీను, పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి, పులి వెంకటేశ్వర్ రెడ్డి, మురుగమ్మి సర్పంచ్ శీను, ఎస్సీ నాయకులు బక్క భాగ్యరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ చర్మకాల సంక్షేమ సంఘం మినీ లెదర్ పార్క్ కోసం కేటాయించిన 25 ఎకరాల స్థలం కొరకు శ్రీనివాస్ నాయక్ కలెక్టర్ కు వినతి పత్రం
### రాష్ట్ర కోశాధికారి జన్నె కొండయ్య ఆధ్వర్యంలో



గోదావరిఖని టౌన్ రిపోర్టర్– సురేష్(శుభోదయం న్యూస్) తెలంగాణ చర్మకాల సంక్షేమ సంఘం రాష్ట్ర కోశాధికారి జన్నె కొండయ్య ఆధ్వర్యంలో కలెక్టర్ గారికి మెనీ లెదర్ పార్క్ కోసం కేటాయించిన 25 ఎకరాల స్థలం విషయమై పెద్దపెల్లి కలెక్టరేట్ లో వినతి పత్రం అందజేయడం జరిగింది దానికి వారు స్పందిస్తూ ఈ విషయమై లీడ్ క్యాప్ ఎండి శ్రీనివాస్ నాయక్ కలెక్టర్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది వినతిపత్రాన్ని పరిశీలించి ఎమ్మార్వో కి అక్కడి పరిస్థితులు స్థలం వివరాలు సేకరించి వారికి ఆ స్థలం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అనంతరం వారుమాట్లాడుతూ ఈ మినీ లెదర్ పార్క్ స్థలం విషయంలో పార్టీలకు , కుల సంఘాలకు, ట్రేడ్ యూనియన్ అతీతంగా శిక్షణ పొందిన చర్మకారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో శిక్షణ పొందిన అభ్యర్థులు ఇంకా ఎవరైనా ఉన్నట్టయితే వారి సర్టిఫికెట్లతోఈ క్రింది నెంబర్లలో సంప్రదించవలసిందిగా కోరుతున్నాం ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు పుల్లూరు సంతోష్, ఎనగందుల శ్రీనివాస్, సావనపల్లి వెంకటస్వామి, సలిగంటి పోషం, కొట్టే సాంబ రాజు, కొలుగురి యాదగిరి, తాండ్ర సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## మాచు పల్లెలో పొలం పిలుస్తుంది కార్యక్రమం
## అగ్రికల్చర్, ఏవో రమేష్ రెడ్డి



సిద్ధవటం మండల విలేకరి జాకీర్ హుస్సేన్ (శుభోదయం న్యూస్): మండలంలోని మాచుపల్లి రైతు సేవ కేంద్ర పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ నిర్వహించి అనంతరం క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ రెడ్డి మంగళవారం మాట్లాడుతూ, వరి పంటలో, కాలిబాటు లు కోనలు తుంచి నాటడం జిగురు, పూసిన పసుపు తెలుపు నీలం పల్లాలు, లింగా కర్మక, బుట్టలు అమర్చడం గురించి రైతులకు తెలియజేశారు ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించాలని వరి నారు యాజమాన్యం సాగు సద్వినియోగం సన్య రక్షణ చర్యలు సకాలంలో చేపట్టాలని జొన్న, మొక్కజొన్న, పంటలు చేపట్టిన రైతులు సదురు కంపెనీలతో వ్రాతపూర్వక ఒప్పందం తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం వ్యవసాయకులు చిన్నక్క, లక్ష్మీదేవి రైతులు పాల్గొన్నారు.

## కనిగిరి నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు : దద్దాల



కనిగిరి, రిపోర్టర్ జి ప్రసాదరావు (శుభోదయం న్యూస్): ప్రేమ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందం నింపిన ఏసు క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఏసు క్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని కనిగిరి నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని కనిగిరి వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జ్ దద్దాల.నారాయణ యాదవ్ కోరారు.కనిగిరి నియోజకవర్గ క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## రైతు భూ సమస్యల పరిష్కారమే కూటమి, ప్రభుత్వం ధ్యేయం
### మాజీ మార్కెట్ కమిటీచైర్మన్ సయ్యద్ జవహర్ భాష




సిద్ధవటం మండల విలేకరి జాకీర్ హుస్సేన్(శుభోదయం న్యూస్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో రైతు భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ గ్రామాన రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి రైతుల భూములు అన్యాక్రాంతం చేసిన వారి ఆగడాలు అరికట్టిందుకే సభలు ఏర్పాటు చేశారని మాజీ మార్కెట్ చైర్మన్ సయ్యద్ జవహర్ భాష మంగళవారం సిద్ధవటం గ్రామం రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో ఆయన అన్నారు గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు విముక్తి చెందే విధంగా ఎలాంటి భూ సమస్యలపై సభలు జరగలేదని ప్రతిపక్షంలో రైతులకు ఇచ్చిన వాగ్దానం మేరకు భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ గ్రామాన రెవెన్యూ గ్రామసభలు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కారం కోసం చర్యలు తీసుకున్నారని రైతుల భూములు అన్యాక్రాంతం చేస్తే మా రాష్ట్ర ముఖ్యమంత్రి చట్టం తీసుకుని వచ్చి కఠిన శిక్ష పడే విధంగా అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని గ్రామాలు అభివృద్ధి చెందే విధంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి పట్టుదల గ్రామాల్లో కనిపిస్తుందని పంచాయతీ అభివృద్ధి చెందే విధంగా నిధులు సమకూర్చడం ఆయనకే దక్కిందని గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు ఎలాంటి నిధులు ఇవ్వలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు మండల ఇంచార్జ్ తాసిల్దార్ మాధవి లత మాట్లాడుతూ గ్రామ సభలో భూ సమస్యలపై రైతులు26 అర్జీలు లికిత పూర్వకంగా అందించారు అని సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రతినిధి బి ఓబులయ్య వీఆర్వో కేశవులు,రజిని, సచివాలయ సర్వేయర్ పురుషోత్తం,రైతులు స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దేవాలయాలను కాపాడుకుందాం
## మామిడి సత్యనారాయణ




విజయవాడ (శుభోదయం న్యూస్) : : జనవరి 5వ తేదీన విజయవాడ సమీపంలోని గన్నవరం విమానాశ్రయం వద్ద గల కేసరపల్లి గ్రామములో జరుగబోయే హైందవ శంఖారావం మహాసభకు రాజకీయ పార్టీల, కులాలకు అతీతంగా రెండు తెలుగు రాష్ట్రాల నుండి హిందూ బంధువులు అంతా పెద్ద సంఖ్యలో పాల్గొని, హిందూ దేవాలయ స్వయంప్రతిపత్తి కోసం మద్దతు తెలుపాలని ప్రముఖ వాస్తు సిద్ధాంతి మామిడి సత్యనారాయణ కోరారు. మంగళవారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇంతకాలం అయినప్పటికి హిందువుల మనోభావాలకు గాని, హిందూ దేవాలయాలకు గాని, హిందువుల విశ్వాసానికి గాని స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. దేశంలో సెక్యులర్ ముసుగులో కొందరు కుహన శక్తులు సనాతన ధర్మంపై హిందూ దేవాలయాలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడులకు ప్రేరేపిస్తూ, హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని తెలిపారు. అంతేగాకుండా హిందువుల దేవాలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని, దేవాలయాల భూములను ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఇష్టారాజ్యంగా వాడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇతర మతస్థుల ఆలయాలు మాత్రం స్వయంప్రతిపత్తి కలిగి ఉన్నాయి కాని దేశంలో మెజారిటీ ఉన్న హిందువుల దేవాలయాలు మాత్రం ప్రభుత్వ ఆదీనంలో ఉండి, దేవాలయాలను పరిరక్షించకుండా దర్శనం టికెట్ల నుండి ప్రసాదం టికెట్ల వరకు ఆదాయమే లక్ష్యంగా పెట్టుకొని, దండుకుంటున్న ప్రభుత్వాలను ప్రతి హిందువు ప్రశ్నించి, హిందూ దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించే వరకు ప్రతి హిందువు ముందుండి పోరాడాలని సనాతన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలని కోరారు.ఈ సందర్భంగా వారు హైందవ శంఖారావం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాల వెంకటేశ్వర్లు, కనకపర్తి రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## పింద్రాల పుల్లయ్య కి నామినేటెడ్ పోస్టు ఇవ్వాలి - జటావతు రామారావు



విజయవాడ: (శుభోదయం న్యూస్) : తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటినుండి ఎన్టీఆర్ మీద అభిమానంతో నేటి వరకు పార్టీలో కొనసాగుతూ చంద్రబాబునాయుడు చేస్తున్న రాష్ట్ర అభివృద్ధికి జేజేలు పలుకుతూ పార్టీలో కొనసాగుతున్న వ్యక్తి పి%శీ%ద్రాల పుల్లయ్య అన్నారు.ఎస్టి కోటాలో నామినేటెడ్ పోస్ట్ కి అర్హత కలిగిన వ్యక్తి పుల్లయ్యని టిడిపి సెల్ నాయకులు జటావతు రామారావు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి




చేశారు .మంగళవారం గాంధీ నగర్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పి%శీ%ద్రాళ్ల పుల్లయ్య పార్టీ పెట్టినప్పుడు నుండి నేటి వరకు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న పార్టీని బలోపేతం చేస్తూ విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామ పార్టీ ప్రెసిడెంట్ గా పంచాయతీ వార్డు మెంబర్ గా ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడుగా తాడేపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్ కమిటీ మెంబర్ గా కంకిపాడు గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్తగా జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శిగా ,ఉపాధ్యక్షుడుగా పార్టీ సెల్ జిల్లా కార్యదర్శిగా పార్టీకి అధిక సేవలు అందించారు. పార్టీకి సేవ చేస్తూ సామాజిక స్పృహతో అనేక కార్యక్రమాలు చేస్తున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్న పుల్లయ్య ఇప్పటివరకు పార్టీ నుండి ఎలాంటి నామినేటెడ్ పోస్టులు ఆశించలేదు అన్నారు. రాష్ట్రంలో ఎస్టీ వర్గాల కోసం అనేక సేవా కార్యక్రమాలు పార్టీ అభివృద్ధి కి నిరంతరం కృషి చేశారు.ఎస్టీ సెల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. అటువంటి వ్యక్తికి ఎస్టీ చైర్మన్ పదవి ఇవ్వడం ద్వారా పార్టీ కి గుర్తింపు వస్తుందని జటావతు రామారావు అన్నారు. మంత్రి లోకేష్ నీ పుల్లయ్య కలిసినప్పుడు తప్పకుండా ఈసారి మీకు న్యాయం చేస్తామని తాతగారు పార్టీ స్థాపించిన దగ్గర నుండి నేటి వరకు సేవలందిస్తున్నారని అన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుల్లయ్య కి అవకాశం ఇస్తారని విజ్ఞప్తి చేస్తున్నామని మీడియా ముఖంగా తెలిపారు. ఈ సమావేశంలో స్వర్ణకుమారి మురళీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు...

## పాతకుంట చెన్నారెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించిన కనిగిరి జడ్పిటిసి మడతల కస్తూరి రెడ్డి



కనిగిరి, రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్):కనిగిరి మండలం వంగపాడు పంచాయతీ ఎగువపల్లి గ్రామానికి చెందిన పాతకుంట చెన్నారెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించి వాళ్ల కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో వంగపాడు సర్పంచ్ రాళ్లపల్లి తిరుపతయ్య రైతు అధ్యక్షుడు సిద్ధారెడ్డిమరతల రాజారెడ్డి శనివారపు శిరారెడ్డి దేవి రెడ్డి నారాయణ పాల్గొన్నారు.

## సింగరాయకొండ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణకు త్రిసభ్య కమిటీ ఏర్పాటు..!



సింగరాయకొండ, మండల రిపోర్టర్ – పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్ ):ప్రకాశం జిల్లా సింగరాయకొండ గ్రామపంచాయతీలో 2021 ఏప్రిల్ 1 నుండి నేటి వరకు నిధుల దుర్వినియోగం జరిగినట్టు వచ్చిన ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు త్రిసభ్య కమిటీ విచారణకు ఏర్పాటైంది. ఈ కమిటీ డిసెంబర్ 27, 2024న సింగరాయకొండ పంచాయతీకి వెళ్లి సంబంధిత రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను పరిశీలించనుంది. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ అందుకు అవసరమైన అన్ని రికార్డులను సమర్పించాలని ఆదేశించారు.ఈ విచారణను పంచాయతీ రాజ్ కమిషనర్ గతంలో నిర్వహించిన తనిఖీల్లో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ప్రారంభించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మరియు ఇతర పథకాల అమలులో అవకతవకలు జరిగినట్టు అనుమానాలు వెలుగులోకి వచ్చాయి. ఈ దర్యాప్తు ద్వారా నిధుల వినియోగంలో జరిగిన లోపాలను వెలికితీయడం మరియు పారదర్శకత కల్పించడమే లక్ష్యం. విచారణకు సంబంధిత మాజీ అధికారులు, ఫిర్యాదుదారులు హాజరై తమ సమాచారాన్ని అందించాలని సూచించారు.

### ఈ కమిటీలో కింది సభ్యులు ఉంటారు:


1. ఎంఈపిఎంఏ ప్రాజెక్టు డైరెక్టర్, ఒంగోలు2. జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ పరిపాలన అధికారి, ప్రకాశం జిల్లా3. జిల్లా ఆడిట్ అధికారి కార్యాలయ సహాయ ఆడిటర్, ప్రకాశం జిల్లాఈ కమిటీ సింగరాయకొండ గ్రామపంచాయతీలో జరిగిన నిధుల వినియోగంపై విచారణ నిర్వహించి, 7 రోజుల్లో నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

## పామూరు పట్టణ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన పాలపర్తి



ప్రకాశం జిల్లా బ్యూరో – చంద్ర (శుభోదయం న్యూస్): ప్రేమ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందం నింపిన ఏసు క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఏసు క్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని కనిగిరి నియోజకవర్గం పామూరు మండల మరియు పట్టణ ప్రజలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని టిడిపి నాయకులు పామూరు సాగునీటి సంఘం చైర్మన్ పాలపర్తి రమణయ్య కోరారు. క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ ఆయన క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## వైసీపీ కార్యకర్త వేసపోగు మత్తయ్య పార్థివ దేహానికి నివాళి అర్పించిన - వైసిపి ఇన్చార్జి దద్దాల



కనిగిరి, రిపోర్టర్ జి. ప్రసాదరావు (శుభోదయం న్యూస్): హనుమంతునిపాడు మండలం నల్లగండ్ల పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ ముఖ్య కార్యకర్త వేశా పోగు మత్తయ్య హార్ట్ ఎటాక్ తో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న వైసిపి ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ నల్లగండ్ల గ్రామం వెళ్లి మత్తయ్య పార్థివదేహానికి నివాళి అర్పించారు మట్టి ఖర్చుల నిమిత్తం 20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు అలానే కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని వేడుకున్నారు ఈ కార్యక్రమంలోమండల పార్టీ అధ్యక్షులు యక్కంటి శ్రీనివాసుల్ రెడ్డి సర్పంచ్ బత్తుల శ్రీనివాసులు రెడ్డి, మండలం సీనియర్ నాయకులు ఆదినారాయణ రెడ్డి,మండల ఎస్సీ సెల్ నాయకులు వేశపోగు గురు ప్రసాద్,బాలాజీ, వెలిగండ్ల మండల నాయకులు పల్నాటి భాస్కర్ రెడ్డి,సర్పంచ్ స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, వాలిచర్ల సర్పంచ్ మరియా బాబు, గ్రామ నాయకులు వేశాపోగు సుందర్,బాలసాని యెహోషువ, వేశాపోగు విక్టర్, వేస పోగు జయపాల్, గూడూరి ఏసు, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ప్రశాంతత వాతావరణం ఉండాలి ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్, బాబు



సిద్ధవటం, మండల విలేకరి జాకీర్ హుస్సేన్ (శుభోదయం న్యూస్): ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబును తెలుగుదేశం పార్టీ నేతలు ఘనంగా సన్మానం చేశారు. మండలంలోని మాచుపల్లి గ్రామం చెందిన మాజీ మార్కెట్ చైర్మన్ సంజీవరెడ్డి, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ మాజీ డైరెక్టర్ బాలిరెడ్డి తన కార్యాలయంలో మంగళవారంశాలవుతో సత్కరించారు ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబు మాట్లాడుతూ మండలంలో ప్రశాంత వాతావరణం ఉండేలా మండల ప్రజలు సహకరించాలని,సమస్యలు ఏమైనా ఉంటే నా దృష్టికి తీసుకురావాలని, అక్రమ ఇసుక రవాణా అరికట్టేందుకు పల్లె ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఉచితంగా గృహ నిర్మాణాల కు మాత్రమే రవాణా చేసుకోవాలని ఆయన సూచించారు.

# బస్సు ఢీకొని ఒకరు మృతి



దోర్నాల, మండల రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలం, బీఎంసీ కాలనీ, చిన్న గుడిపాడుకు. మధ్యలో మంగళవారం ఉదయం బొమ్మలాపురం వాస్తవ్యులు గుమ్మ వెంకటేశ్వర్లు వయస్సు 55 మోటార్ సైకిల్ మీద పొలం పని నిమిత్తమై పొలానికి వెళ్ళొస్తుండగా, ప్రైవేట్ స్కూల్ బస్సు తగలడంతో అక్కడికక్కడే మరణించాడు.

## సిఎస్పురం మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షునిగా సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఏకగ్రీవ ఎన్నిక



కనిగిరి, రిపోర్టర్ జి ప్రసాదరావు (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు కోట హనుమంతరావు సూచనతో ప్రకాశం జిల్లా యువజన సంఘం అధ్యక్షులు కొలిపర్తి మారుతి ఆధ్వర్యంలో సిఎస్పురం మండలం ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులుగా సోమిశెట్టి వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ప్రకాశం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మువ్వల శ్రీనివాసులు ఎలక్షన్ ఆఫీసర్ గా ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం మీడియా చైర్మన్ చెక్క వెంకట కేశవరావు పర్యవేక్షణలో ప్రకాశం జిల్లా సిఎస్పురం మండలం ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులుగా సోమిశెట్టి వెంకటేశ్వర్లు ని మిట్టపాలెం ఆర్యవైశ్య సత్రం నందు జరిగిన సమావేశంలో ఏకగ్రీవం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు గుబ్బ వెంకట పూర్ణచంద్రరావు సిఎస్పురం మండల ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## బాలుడిని తల్లి చెంతకు చేర్చడంలో కృషి చేసిన పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్







ప్రకాశం జిల్లా బ్యూరో - చంద్ర (శుభోదయం న్యూస్):ఇంటి నుండి వెళ్ళిపోయిన తన బాబుని తిరిగి తల్లి చెంతకు క్షేమంగా చేర్చడంలో కృషి చేసిన హోంగార్డుని, అనుక్షణం బాలుని సమాచారం కొరకు సంబంధిత అధికారులను అప్రమత్తం చేసిన కనిగిరి నియోజకవర్గం పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం భీమా నాయక్ ను, సబ్ ఇన్స్పెక్టర్ టి కిషోర్ బాబు లను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.పామూరుకి చెందిన 8 వ తరగతి చదువుతున్న ఒక బాలుడు (13 సం) స్కూల్ కు సరిగా వెళ్లడంలేదని తల్లి మందలించిన కారణంతో పామూరు నుండి ఒంగోలుకు బస్సు లో వచ్చి సుమారు సాయంత్రం 04.00 గంటల సమయంలో రైల్వే స్టేషన్ పోయే మార్గంలో ఏదో బాధగా దిగాలుగా నడుచుకుంటూ వెళుతున్న ఆ బాలున్ని జడ్జి గారి బంగ్లా వద్ద విధులు నిర్వహిస్తున్న హోంగార్డు జి.మదన్ కుమార్ (%ఎ+%-780) గమనించి ఆ బాలుడి వివరాలు ఆరాతీసి, అతనికి భోజనం పెట్టించి పామూరు పోలీస్ అధికారులకు జరిగిన విషయం తెలియపరిచి దగ్గర్లో ఉన్న ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఉంచగా అంతట ఆ బాలుడి తల్లిని పిలిపించి వారికీ కౌన్సిలింగ్ నిర్వహించి క్షేమంగా అప్పగించారు. తన కుమారుణ్ణి సురక్షితంగా తనకు అప్పగించిన పోలీసులకు బాలుని తల్లి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు.

## బొంపెద్దు పాడు, కంబాలదిన్నె అంగన్వాడి కేంద్రాలలో ఘనంగా జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకలు



ప్రకాశం జిల్లా బ్యూరో - చంద్ర (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు మండలంలోని బొట్లగూడూరు సెక్టార్ పరిధిలోని బొంపెద్దు పాడు, కంబాలదిన్నె అంగన్వాడి కేంద్రాలలో ముందస్తుగా క్రిస్మస్



వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు క్రిస్మస్ తాత శాంతా క్రశ్ గురించి అవగాహన కల్పించి వారికి బహుమతులను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కే దివ్య, సిహెచ్ విజయ,జి భాగ్యలక్ష్మి, కే లూదియా, పిల్లల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## హెచ్ ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి కాంట్రాక్ట్ ఔర్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ కి చెడ్డ పేరు తెస్తే ఊరుకోం

### యూనియన్ ప్రెసిడెంట్ ఎ శారద..



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, (శుభోదయం న్యూస్): హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి లేబర్ ఆఫీస్ లో జాయింట్ కమిషనర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కొందరు నాయకులు యూనియన్ వాళ్ళ స్వలాభాల కోసం వాడుకుంటూ యూనియన్ కి చెడ్డ పేరు తెస్తున్నారని కమిషనర్ తెలియజేయడం జరిగింది. యూనియన్ ప్రెసిడెంట్ ఎ.శారద కమిషనర్ వివరించడం జరిగింది. దీనిపై తొందరగా తగు చర్యలు తీసుకోవాలని ఇలాంటి తప్పులు మళ్ళీ రిపీట్ కావద్దని కమిషనర్ ని కోరడం జరిగింది కమీషనర్ గారు సానుకూలంగా స్పందిస్తూ నోటీసులు పంపిస్తానని యూనియన్ నాయకురాలు ప్రెసిడెంట్, మరియు ఉత్తర నాయకులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మన్నె నరసింహ, పటోళ్ల మాణిక్ రెడ్డి, సయ్యద్ రిజ్వాన్, శ్రీనివాస్, ఒబేద్, షోయబ్,అలీబాబా,శివ, శ్రీహరి, నరసింహ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్ప స్వామి పడి పూజ..! గురుస్వాముల ఆధ్వర్యంలో శ్రీధర్మశాస్త్రకు అభిషేకం



మేడిపల్లి, మండలం రిపోర్టర్ - సందీప్ రెడ్డి (శుభోదయం న్యూస్): ఘట్కేసర్ మండలము పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ లో గల డాక్టర్ ప్రకాష్ రావు నగర్ 10వ వార్డ్ కాలనీ జాయింట్ సెక్రెటరీ తిరుమలయ్య, దస్తమ్మ స్వగృహంలో అయ్యప్ప స్వామి పడిపూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా పుణ్యాహవాచనం గణపతి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అయ్యప్ప స్వామి ఉత్సవ మూర్తులకు



పంచామృతాలతో అభిషేకం నిర్వహించి,అనంతరం అయ్యప్ప 18వ మెట్ల పూజను శాస్త్రోక్తంగా నిర్వహించి కర్పూరం వెలిగించారు. ఇట్టి పడి పూజా కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్వాములు పాల్గొని భక్తి గీతాలను అలపించారు. స్వాములు చేసే భజనలు భక్తి గీతాలు వచ్చిన భక్తులను అలరించాయి. స్వాముల శరణు ఘోషతో ఈ ప్రాంతం అంతా మారుమ్రోగింది.అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ కె. సూర్యకాంత్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సురేందర్ రావు, జనరల్ సెక్రటరీ ఎస్. రఘు, ఎగ్జిక్యూటివ్ నెంబర్ అభిషేక్, అయ్యప్ప దీక్షా స్వాములు యాదగిరి, పవన్, గణేష్, మహిళలు సీతా, రూపా, మౌనిక, నీరజా భక్తులు పిల్లలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రాముని గుండాలపై 150 అడుగుల విగ్రహ భూమి పూజ చేసినా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



రామగుండం మండలం రిపోర్టర్-తిరుపతి,(శుభోదయం న్యూస్) రామగుండం పట్టణంలో రాముని గుండాలపై 150 అడుగుల విగ్రహ భూమి పూజ రాముని గుండాలపై నిర్మాణానికి భూమి పూజ చేసిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారు వారి సతీమణి మనాలి ఠాగూర్ గారు రాముని గుండాలపై స్వయంభుగా వెలిసిన హనుమాన్ ఆలయ నిర్మాణానికి తన వంతుగా కోటి రూపాయల నిధులు ఇస్తానని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ హామీ ఇచ్చారు మంగళవారం నాడు ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ నిర్మాణం త్వరగా త్వరగా పూర్తిచేసే అందుకు కృషి చేస్తానని తెలిపారు ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సింగరేణి జిఎం లలిత్ కుమార్ రామగుండం ఎస్సీ విజయేందర్ ఎన్టీపీసీ జిఎం గారు ఆర్ ఎఫ్ సి ఎల్ సిబ్బంది కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, వివిధ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## జిన్నారం మండలం పోలింగ్ బూత్ నంబర్ 37 అధ్యక్షులు ఏర్పుల వీరేశ్ ఆధ్వర్యంలో బిజెపి పార్టీలో చేరికలు



జిన్నారం(శుభోదయం న్యూస్ ):జిన్నారం మండలం పోలింగ్ బూత్ నంబర్ 37 అధ్యక్షులు ఏర్పుల వీరేశ్ ఆధ్వర్యంలో బిజెపి పార్టీలో చేరికలు సంగారెడ్డి జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి సమక్షంలో బిజెపి పార్టీలో చేరిన బిఆర్ఎస్ కార్యకర్తలు ఏర్పుల శివరాజ్ , మల్లేష్ , కుమార్, పోతురాజు మహేందర్, పేట మహేష్, వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను భారతదేశం స్వతంత్రం వచ్చినప్పటి నుంచి పేదవారికి న్యాయం జరిగిందంటే అది మోడీ గారి పరిపాలన అని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వంగేటి ప్రతాపరెడ్డి, అలాగే మండల ఉపాధ్యక్షులు పూడూరు సుధాకర్,తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర హెూం మంత్రి అమిత్ షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను అనుచిత వ్యాఖ్యలపై....

### బహుజన సమాజ్ పార్టీ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు మెమోరాండం



రామగుండం మండలం రిపోర్టర్-తిరుపతి,(శుభోదయం న్యూస్) : గోదావరిఖని కేంద్రంలో తేది:-17-12-2024 రోజున పార్లమెంట్లో కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరుని అనుచితంగా వ్యాఖ్యానించిన వ్యాఖ్యలపై బహుజన సమాజ్ పార్టీ పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ఇన్చార్జులు అధ్యక్షులు ఇరికిల్ల రాజ నర్సయ్య గారు మాట్లాడుతూతేది:-17-12-2024 రోజున పార్లమెంటులో కేంద్ర హెూమ్ మంత్రి అమిత్ షా గారు ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత విశ్వవిజ్ఞాని డాక్టర్ అంబేద్కర్ గారి పేరును అనుచితంగామాట్లాడినందుకు కేంద్ర మంత్రి ఆమిత్ షా గారిని వెంటనే అతని పదవిలో నుండి తొలగించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారికి హెచ్చరిస్తూ తీవ్రంగా ధ్వజమెత్తడం జరిగింది, ఈ కార్యక్రమం గోదావరిఖని చౌరస్తా ప్రాంగణం నుండి ర్యాలీగా మార్కండేయ కాలనీ మహాత్మ జ్యోతిభా పూలే విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుండి రామగుండం మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహం పూలమాల వేసి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయడం జరిగింది, ఈ కార్యక్రమంబహుజన్




సమాజ్ పార్టీ పెద్దపెల్లి జిల్లా ఇన్చార్జిలు పేగ నరేష్ గారు వర్కిల్లా మల్లేష్ గారు, జిల్లా అధ్యక్షులు ఇరికిల్ల రాజనర్సయ్య గారు, కార్యదర్శి నక్క తిరుపతి గారు, ట్రెజరర్ పులిపాక బొందయ్య గారు జిల్లా మహిళా కన్వీనర్ కాంపెల్లి అనిత కేఎల్ బహుజన్ గార్ల సమక్షంలో రామగుండం పెద్దపల్లి మంథని మూడు నియోజకవర్గాలను ఏకం చేస్తూ ఈ యొక్క కార్యక్రమంలోవిజయవంతంగా జరిగింది,ఈ కార్యక్రమంలో రామగుండం నియోజకవర్గ ఇన్చార్జి ఇరికిల్లా కనకయ్య గారు, అధ్యక్షులు జనగాం లింగయ్య గారు, రామగుండం నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ మారపల్లి రవికుమార్ గారు, ఆర్గనైజేషన్ సెక్రటరీ జనం మల్లేష్ గారు, సీనియర్ నాయకులు జింక ఉదయ్ గారు, సిరికొండ సది గారు, మహిళా కన్వీనర్ అరెల్లి శారద గారు, పులిపాక కైలాష్ గారు, ఎండి కాసిం గారు, పోచమాల్లు గారు, పెద్దపెల్లి నియోజవర్గ అధ్యక్షులు బొంకూరి దుర్గయ్య గారు, ప్రధాన కార్యదర్శి సాతురి అనిల్ గారు, ఆరేపల్లి లక్ష్మణ్ గారు, మంథని నియోజక వర్గ ఇంచార్జి జనగాం రవికుమార్ గారు ప్రధాన కార్యదర్శి పూరెల్ల రాజేష్, ఈకార్యక్రమంలో పెద్ద ఎత్తున 200మంది కార్యకర్తలు 50 మంది మహిళ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన తెలియజేసినారు, అదేవిధంగా పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షగారికి మెమోరండం ఇవ్వడం జరిగింది.

## డిసెంబర్ 26న జరిగే సిపిఐ శతవసంతోత్సవాలను జయప్రదం చేయండి

### సిపిఐ నగర కార్యదర్శి కే కనకరాజ్




గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్): అనేక ప్రజా పోరాటాలతో పునీతమైనది ఎర్రజెండా అని సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కే. కనకరాజ్ తెలిపారు. డిసెంబర్ 26న 99సంవత్సరాలు పూర్తి చేసుకుని 100వ వసంతం లోకి అడుగిడుతున్న సందర్భంగా వాడవాడల ఎర్ర జండాలు ఎగురవేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మార్క్సిజం, లెనినిజం ఆశయంగా భారతదేశంలో 1925లో ఆవిర్భవించి భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని స్వాతంత్రోద్యమంలో పాల్గొనడమే కాకుండా నిజాం నవాబుకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటాన్ని నిర్వహించిన ఘనత కమ్యూనిస్టు పార్టీకే ఉందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వంద సంవత్సరాలుగా పేద ప్రజలకు అండదండగా ఉంటూ సేద తీరుస్తూ నీడనిస్తున్న జెండా ఎర్రజెండా అని ఆయన అన్నారు. డిసెంబర్ 26న ఉదయం 10 గంటలకు స్థానిక భాస్కరరావు భవన్ లో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమై సాయంత్రం ఐదు గంటలకు భాస్కర్ రావు భవన్ నుండి ఊరేగింపు నిర్వహించి స్థానిక చౌరస్తాలో సభ నిర్వహిస్తామని తెలిపారు.కావున పార్టీ మరియు ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## పూలే, అంబేద్కర్ జ్ఞానమాలకు పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ కు ఆహ్వానం



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం ఆమోదం పొంది అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా చేపట్టిన పూలే, అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమానికి పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణను ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, ఆలయ ఫౌండేషన్, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ నాయకులు ఆహ్వానించారు. ప్రతిష్టాత్మకంగా ప్రతి ఆదివారం పూలే, అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎంపీకి వివరించారు. మంగళవారం గోదావరిఖని పట్టణానికి వచ్చిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు కలిశారు. ప్రతిష్టాత్మకంగా ప్రతి ఆదివారం చేపడుతున్న మహాత్మ జ్యోతిరావు పూలే, బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు. ఆహ్వానించిన వారిలో సీనియర్ జర్నలిస్టు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంపల్లి సతీష్, రాష్ట్ర కార్యదర్శి మంతెన లింగయ్యతోపాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి.మల్లికార్జున్, ముక్క సుదర్శన్, దుబాసి మల్లేష్, తొగరి తిరుపతి తదితరులున్నారు.

## : శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు






రామగుండం మండలం రిపోర్టర్-తిరుపతి,(శుభోదయం న్యూస్) గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా యేసు క్రీస్తు రాక గురించి, మరియు ఆయన జీవిత విశేషాల గురించి చిన్నారులచే వివిధ సన్నివేశాలతో వివరింపచేశారు. ఈ వేడుకలలో భాగంగా విద్యార్థులు నృత్యాలు, పాటలు, రకరకాల ప్రదర్శనలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ లోక రక్షణ కొరకు ఏసు ప్రభువు జన్మించి, ఎన్నో గొప్ప కార్యాలు చేసి, పాపములు చేసిన వారిని క్షమించి, వారికి సన్మార్గాలను నేర్పిన గొప్ప కరుణామయుడు అని కొనియాడారు. తదనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులందరికీ మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం అరవింద్ రెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజు గార్లు మరియు పాఠశాల డీన్, శ్యామ్, కిరణ్ ఇంఛార్జి లు, స్రవంతి, తాస్లీంఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవాళికి ప్రేమ, శాంతిమార్గం చూపిన మహనీయుడు ఏసుక్రీస్తు

### రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



రామగుండం మండలం రిపోర్టర్-తిరుపతి,(శుభోదయం న్యూస్) స్థానిక గోదావరిఖని బృందావన్ గార్డెన్ లో తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించడం



జరిగింది.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామగుండం నియోజవర్గ శాసనసభ్యులు గౌరవ శ్రీ రాజ్ ఠాకూర్ గారు హాజరయ్యారు.క్రైస్తవ మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం క్రైస్తవ సోదరులు ఎమ్మెల్యే శ్రీ రాజ్ ఠాకూర్ గారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మార్వో కుమారస్వామి గారు సంబంధిత అధికారులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు ఉన్నారు.





# మత సామరస్యంకి ప్రతీక క్రిస్మస్

(శుభోదయం న్యూస్ ):క్రిస్మస్ అనేది ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మందికి ఒక ముఖ్యమైన హిందూ క్రైస్తవ పండుగ. ఈ పండుగను క్రైస్తవులు ఐతే, యేసు క్రీస్తు జన్మదినాన్ని గుర్తించుకుంటారు. అయితే ఈ పండుగకు గల అంతర్జాతీయ ప్రాధాన్యత మత వివిధతల్ని, సామరస్యాన్ని మరియు మానవత్వాన్ని ప్రతిబింబిస్తుంది. క్రిస్మస్ పండుగను మనం మత సామరస్యం యొక్క ఒక చిహ్నంగా కూడా చూడగలం.

### క్రిస్మస్ సందేశం

క్రిస్మస్ పండుగ యేసు క్రీస్తు యొక్క ప్రేమ, కరుణ, మరియు శాంతి యొక్క సందేశాన్ని ప్రపంచానికి పంపుతుంది. ఈ సందేశం అన్ని మతాలకు సంబంధం లేకుండా, మనందరికీ శాంతి, దయ, మరియు ప్రేమ పట్ల గౌరవం చూపించేలా పిలుస్తుంది. ముఖ్యంగా, క్రిస్మస్ ద్వారా క్రైస్తవులు యేసు యొక్క పుట్టినరోజుని జరుపుకుంటారు, కాని ప్రపంచంలోని వివిధ మతాలు కూడా ఈ రోజును మానవత్వం మరియు అందరికీ శాంతి కోరికతో ఆచరించడానికి ఉపయోగిస్తారు.

### మత సామరస్యం ప్రాముఖ్యత

ప్రపంచంలో వివిధ మతాలు ఉండటంతో, అన్ని మతాలు ఒక్కటి అయ్యే అవకాశం ఉండదు. అయితే, క్రిస్మస్ పండుగ మత సామరస్యం యొక్క ఓ ఉదాహరణ. ఈ రోజున ప్రపంచవ్యాప్తంగా వివిధ మతాల ప్రజలు కలిసి పండుగలను జరుపుకుంటారు. ప్రతి మతం తనకన్నా ఇతరులందరికీ గౌరవం ఇవ్వడం, వేదికగా ఉండడం అన్నది క్రిస్మస్ యొక్క ప్రధాన ఆలోచన. అది మనస్సులలో వర్గాలు, మతాలు లేదా జాతులు లేకుండా పరస్పర ప్రేమ, సహనం, మరియు సహకారం నిండిన సమాజం నిర్మించడానికి దారితీస్తుంది.

### క్రిస్మస్ మరియు మానవత్వం

క్రిస్మస్ పండుగ యొక్క నైతిక సందేశం మానవత్వానికి సంబంధించినది. ఎవరైనా ఎటువంటి మతం లేకపోయినా, ఆవశ్యకమయినప్పుడు మనమందరం ఒకరినొకరు సహాయం చేయాలని సందేశం ఇస్తుంది. "శాంతి భద్రతతో ఉండండి" అన్న యేసు యొక్క సందేశం, మతాల మీద అడ్డంకులు లేకుండా, మనిషి మనిషితో సహజీవనాన్ని బలపరిచే గుణాలను ప్రేరేపిస్తుంది. దీని ద్వారా మనం మానవత్వానికి అనుగుణంగా జీవించే విధానం నేర్చుకుంటాము.

### మూల్యాల ప్రాధాన్యం

క్రిస్మస్ పండుగలోని ప్రధాన అంశం ప్రేమ. ఈ పండుగ మాతృసంగతి, అంగీకారం, మరియు ప్రజల మధ్య ప్రేమను పెంపొందించేలా సూచిస్తుంది. మనం మన పరస్పర సంబంధాలలో ప్రేమను పెంపొందిస్తూ, మన సమాజంలో సాంఘిక సమరస్యం, మానవత్వం వంటి విలువలను పెంచుకోవడం కూడా అత్యంత అవసరం.క్రిస్మస్ అనేది కేవలం ఒక మత పండుగ కాకుండా, అది మానవత్వం, మత సామరస్యం మరియు పరస్పర గౌరవం యొక్క ప్రతీక. ఈ పండుగ ప్రతి ఒక్కరికీ మంచి మనస్సు, శాంతి, ప్రేమ, మరియు సహనం కలిగించే సందేశాన్ని అందిస్తుంది. దీని ద్వారా మానవాళి ముక్కుచెందిన హృదయాలు, ప్రతి ఒక్కరూ ఇరుక్కోని సమాజంలో అందరికీ సహాయం చేయాలని సంకల్పంతో ముందుకు సాగడం తప్పనిసరి. క్రిస్మస్ పండుగ మనం మతపరంగా కానీ, మానవతాపరంగా కానీ ఒకరినొకరు అంగీకరించే రోజుగా ఉండాలని సూచిస్తుంది.మన దేశంలో పండుగ ఎవరిదైనా, సెలవు మాత్రం అందరికీ ఉంటుంది. ఇది మనం సెక్యులరిజం అనే గొప్ప మూల్యం చాటుతున్నామని చూపుతుంది. కొందరు భయపడుతుంటారు మన దేశం ఒక మతం వైపు మొగ్గు చూపుతుందని. కానీ, అలాంటి ప్రమాదం ఇప్పటికి ఏనాడూ సంభవించలేదు.మన చరిత్ర మనకు స్పష్టంగా చెప్పుతుందిమన దేశానికి ఎన్నో దాడులు జరిగాయి, అనేకమంది మత మార్పిడికి ప్రయత్నించారు. కానీ, భారతదేశపు బలమైన మత సామరస్యం అలాంటి వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టింది.అందుకే, ప్రతి పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. భారతీయులు తమ సంస్కృతిని, సంప్రదాయాలను పరిరక్షించుకుంటూనే, ఇతరుల పండుగలను గౌరవించడం ద్వారా ప్రపంచానికి అసలైన మత సామరస్యాన్ని చూపిస్తున్నారు.(రచయిత : డాక్టర్ జిఎన్ఆర్ ప్రసాద్, హైదరాబాద్) మత సామరస్యంకి ప్రతీక క్రిస్మస్

## గవిచర్ల మోడల్ స్కూల్లో ప్రవేశ ప్రకటన : ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి...




సంగెం, (శుభోదయం న్యూస్):2025-26విద్యాసంవత్సరానికి6 వ తరగతిలో 100సీట్లు7 నుండి 10వ తరగతులలో గల ఖాళీ సీట్ల భర్తీ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్లైన్ లో ధరఖాస్తు తేది:06 జనవరి 2025 నుండి 28 ఫిబ్రవరి2025 లోగా ఆన్లైన్ లో ధరఖాస్తు చేసుకోగలరు.గవిచర్ల మోడల్ స్కూల్ ప్రత్యేకతలు అధునాతనమైన డిజిటల్ బోధన,అద్భుతమైన లైబ్రరీ,అధునాతనమైన సైన్స్ లాబ్ లు, అనుభవజ్ఞులైన ప్రభుత్వ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల బోధన. 6 వ తరగతి నుండి 12వ తరగతి వరకు ఉచిత విద్యా బోధన, ఐటీ, బ్యూటీషన్ ఒకేషనల్ విద్యా బోధన,చక్కటి ఆటస్థలం,ఆహ్లాదకరమైన పాఠశాల వాతావరణం,మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందించడం,మినరల్ వాటర్ సౌకర్యం కలదు.విద్యార్థుల ప్రతిభను గుర్తించే అన్ని రకాల సాంస్కృతిక, క్రీడా, ప్రతిభ కార్యక్రమాల నిర్వహణ,పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదివే అమ్మాయిలకు హాస్టల్ వసతి కలదు.ప్రవేశ పరీక్ష6వ తరగతి 13 ఏప్రిల్ 2025 (ఆదివారం)వ తేదీన ప్రవేశ పరీక్ష ఉ"10:00 నుండి 12:00 వరకు నిర్వహించ బడును. 7ు10 తరగతుల వారికి 13:04:2025 ఆదివారం మధ్యాహ్నం 2:00 నుండి 4:00 వరకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

## జాయ్ ట్రేడ్ ఫేయిర్ 2025 ఎగ్జిబిషన్ ప్రారంభం

### ముఖ్యఅతిథిగా రామగుండం ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ జిల్లా ఆధ్యక్షులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రారంభం



రామగుండం మండలం రిపోర్టర్-తిరుపతి, (శుభోదయం న్యూస్): ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజలు మానసిక ప్రశాంతత కొరకు, మనోఉల్లాసం కోసం సకుటుంబ సమేతంగా సందర్శించాలని కోరారు. ఈ సారి ఏర్పాటు చేసిన ప్రదర్శన పిల్లలు పెద్దలను, యువతను ఎంతగానే ఆకుట్టుకునే



విధంగా ఉందనితెలియజేసారు. నిర్వాహకులు ఎండి అస్లాం మాట్లాడుతూ, ఇప్పుడు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు రామగుండం పారిశ్రామిక ప్రాంతములో మొట్టమొదటి సారిగా సందర్శకులు, యువత మనసు దోచుకునే విధంగా ఏర్పాటు చేసామని ఇందులో ప్రపంచంలోనే అత్యంత గుర్తింపు పొందిన లండన్ బ్రిడ్జి ముఖ ద్వారము, లండన్ స్ట్రీట్, ప్యాలేస్ సందర్శన యువతకు, సందర్శకులకు అద్భుతమైన మధురానుభూతి కల్గుతుందని, పిల్లలకు మరింత ఎక్సైట్మెంట్, పెద్దలను ఉల్లాసంతో పాటు కుటుంబ సభ్యులు అందరికి సరదానుబూతి కల్గిస్తుందని మరియు మహిళల కోసం వివిధ రాష్ట్రాల నుండి గృహెూపకరణవస్తువులు, కళంకారి బెడ్ షీట్స్, హ్యాండి క్రాఫ్ట్, జ్యూవలరి ఐటమ్స్, హ్యాండ్ బాగ్స్ మొదలైన ఏన్నోరకాల వేరైటీలు ఇంకా కోలంబస్, జాయింట్ వీల్, క్రాస్ వీల్, బ్రెక్ డాన్స్, జంబోజేట్, డెవిల్ హౌజ్ మరియు చిన్న పిల్లల పార్క్ ఏర్పాటు చేసామన్నారు. ఈ ప్రదర్శన ఇప్పుటి నుండి 60రోజుల పాటు ఉంటుంది. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు కల్వల శిరీష సంజీవ్, డివిజన్ అధ్యక్షులు కలువల రంజిత్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు మజ్జి కార్పెంటర్లు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మదర్ ల్యాండ్ సొసైటీ ఆధ్వర్యంలో దేవి శ్రీ ఫుడ్స్ సహకారంతో.....

## క్రిస్మస్ సందర్భంగా హెచ్ఐవి/ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ




సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్ ):ప్రకాశం జిల్లా డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ హెచ్ఐవి/ఎయిడ్స్ (దిష) క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కిరణ్ పందితి హెచ్ఐవి/ఎయిడ్స్ నిర్మూలనలో క్షేత్రస్థాయి సేవల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. మంగళవారం సింగరాయకొండ మండలంలోని మదర్ ల్యాండ్ సొసైటీ టీఐ ప్రధాన కార్యాలయంలో క్రిస్మస్ సందర్భంగా హెచ్ఐవి/ఎయిడ్స్ బాధితులకు ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కందుకూరు, టంగుటూరు, సింగరాయకొండ, ఉలవపాడు, జరుగుమల్లి, గుడ్లూరు మండలాలలోని హెచ్ఐవి బాధితులకు న్యూట్రిషన్ డిస్ట్రిబ్యూషన్ ప్రోగ్రామ్ ద్వారా బియ్యం, కంది పప్పు, వేరుశెనగ పప్పు, బెల్లం, సేమియా, గోధుమ పిండి, రాగి పిండి వంటి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దేవి శ్రీ ఫుడ్స్ ఆహార సరుకుల సహకారం అందించింది. కార్యక్రమాన్ని మదర్ ల్యాండ్ సొసైటీ సంస్థ అధ్యక్షులు టి. రంగారావు ప్రారంభించారు.టి. రంగారావు మాట్లాడుతూ, హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరగకుండా, వారి మందుల వినియోగాన్ని నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే, మందులు వినియోగం ఆపితే వ్యాధిగ్రస్తులకు కలిగే ప్రాణహానిపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పథకాల లభ్యతను బాధితులకు చేరువ చేయడం ద్వారా, వారు మెరుగైన సేవలను పొందగలరని చెప్పారు.క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కిరణ్ పందితి మాట్లాడుతూ, హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు చట్టాలపై అవగాహన కల్పించడం, ప్రభుత్వం అందించే పథకాల గురించి వివరించడం, వాటిని అందించడంలో సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడం సాధ్యమని ఆయన అభిప్రాయపడ్డారు.మదర్ ల్యాండ్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ, క్రిస్మస్ పండుగ సందర్భంగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించడం ఆనందకరమని, ఇది బాధితుల సంక్షేమానికి దోహదపడుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పనిచేస్తే హెచ్ఐవి/ఎయిడ్స్ నిర్మూలన సాధ్యమని పేర్కొన్నారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు సన్నెబోయిన శ్రీనివాసుల నాయుడు, కునపరెడ్డి సుబ్బారావు, మదర్ ల్యాండ్ సొసైటీ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కిరణ్, సిబ్బంది సుజాత, మున్న, నాగమణి, సుభాషిని, సునీత, లావణ్య, మరియు పలువురు వాలంటీర్లు పాల్గొన్నారు. క్రిస్మస్ సందర్భంగా దేవి శ్రీ ఫుడ్స్ సహకారంతో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

## వరికుంటపాడు మండల ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన పందిటి



ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర శుభోదయం న్యూస్ (వరికుంటపాడు):ప్రేమ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందం నింపిన ఏసు క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఏసు క్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండల ప్రజలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని కృష్ణంరాజు పల్లె సర్పంచ్ పందిటి వెంకటనారాయణ కోరారు. క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ ఆయన క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## కనిగిరి నియోజకవర్గం ప్రజలకు ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన యారవ



ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్): ప్రేమ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందం నింపిన ఏసు క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఏసు క్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని కనిగిరి నియోజకవర్గం ప్రజలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని టిడిపి యువ నాయకులు కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాసులు కోరారు. క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ ఆయన క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## పామూరు పట్టణ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మెంటా



ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్): ప్రేమ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందం నింపిన ఏసు క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఏసు క్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని కనిగిరి నియోజకవర్గం పామూరు మండల మరియు పట్టణ ప్రజలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని టిడిపి యువ నాయకులు ఫైర్ బ్రాండ్ మెంటా నరసింహారావు కోరారు. క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ ఆయన క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## తీవ్ర అల్పపీడనం - కోస్తా జిల్లాలకు భారీ వర్షాల సూచన



అమరావతి : బంగాళాఖాతంలో కొనసాగుతోన్న తీవ్ర అల్పపీడనం కారణంగా ఏపీ రాష్ట్రంలో కోస్తా జిల్లాలకు భారీ వర్షాల ముప్పు పొంచి ఉందని, ఏపీ, ఉత్తర తమిళనాడు తీరాల వైపు అల్పపీడనం పయనిస్తుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఇది మళ్లీ బలపడుతుందా లేక బలహీనపడుతుందా అనే దానిపై స్పష్టత లేదు. ప్రస్తుతం తీరానికి సమీపంలో కదులుతున్న నేపథ్యంలో మేఘాలు కమ్ముకుని, చలిగాలులు వీస్తున్నాయి. దీని ప్రభావంతో నేటి నుంచి గురువారం వరకు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది. బుధవారం బాపట్ల, పల్నాడు, ప్రకాశం, పొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. సముద్రంలో గరిష్ఠంగా గంటకు 55 కి.మీ. వేగంతో గాలులు వీస్తున్న నేపథ్యంలో బుధవారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని విశాఖ వాతావరణ కేంద్రం సూచించింది. రాష్ట్రంలోని కళింగపట్నం, విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం సహా తమిళనాడులోని వివిధ పోర్టుల్లో మూడో నెంబరు ప్రమాద హెచ్చరికలు కొనసాగుతున్నాయి.

# బిల్ క్లింటన్‌కు అస్వస్థత



వాషింగ్టన్ (అమెరికా) : అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ (78) అస్వస్థతకు గురయ్యారు. ఆయన వాషింగ్టన్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని క్లింటన్ వ్యక్తిగత సిబ్బంది వెల్లడించారు. బిల్ క్లింటన్ జ్వరంతో బాధపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని, ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని అన్నారు. తనకు అందుతున్న వైద్య సేవల పట్ల క్లింటన్ సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. క్రిస్మస్ నాటికి ఆయన ఇంటికి తిరిగి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడిగా బిల్‌క్లింటన్ రెండు సార్లు (1993-2001) పనిచేశారు. 2001 తర్వాత వైట్‌హౌస్‌ను వీడిన ఆయన తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్నారు.2004లో తీవ్ర ఛాతీ నొప్పి, శ్వాసకోస సమస్యలు రావడంతో ఆయనకు నాలుగుసార్లు బైపాస్ సర్జరీ చేశారు. ఏడాది తర్వాత ఊపిరితిత్తులు మళ్లీ దెబ్బతినడంతో తిరిగి ఆస్పత్రిలో చేర్పించారు.2010లో గుండె సంబంధిత సమస్య రావడంతో మరోసారి శస్త్రచికిత్స చేసి రెండు స్టెంట్లు అమర్చారు. తర్వాత కొద్ది రోజులకు ఆయన పూర్తిగా కోలుకున్నారు.ఇటీవల 2021లో మూత్రనాళ ఇన్‌ఫెక్షన్‌కు చికిత్స తీసుకున్నారు.నవంబర్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో డెమోక్రట్ల తరఫున ఆయన చురుకుగా ప్రచారం నిర్వహించారు.

## కల్లోల కాంగ్రెస్ పాలనలో..
## ధాన్యం కొనుగోళ్లు లేక రైతన్నల ఆందోళనలు

**కొసిరింది గుమ్మడికాయ అన్నట్లు కాంగ్రెస్ సర్కార్ తీరు ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**


**రాష్ట్రంలో 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి అయితే ప్రభుత్వం కొన్నది 46 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే**

**కల్లాల వద్దకే కొనుగోళ్లతో కేసీఆర్ ప్రభుత్వంలో రైతుకు భరోసా కల్పించాం**



హైదరాబాద్: ధాన్యం కొనుగోళ్ల విషయంలో కొన్నది కాకరకాయ.. కొసిరింది గుమ్మడికాయ అన్నట్లు కాంగ్రెస్ సర్కార్ తీరు ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి అయితే ప్రభుత్వం కొన్నది 46 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమేనని విమర్శించారు. రైతుభరోసా కింద ఎకరాకు ఏడాదికి రూ.15 వేల కోట్లకుగాను గత వానాకాలం, యాసంగి కలిపి ఎగ్గొట్టింది రూ.26 వేల కోట్లని చెప్పారు. క్వింటాలుకు రూ.500 బోనస్ అని రైతులలో ఆశలు రేపి దొడ్డు వడ్లకు.. తెడ్డు చూపి, సన్న వడ్లకు సవాలక్ష కొర్రీలు పెట్టి విదిలించింది కేవలం రూ.530 కోట్లని మండిపడ్డారు. అసలు రైతుకే భరోసా లేదని, ఇక కౌలు రైతులు, రైతుకూలీల ఊసెక్కడిదని ధ్వజమెత్తారు. కల్లాల వద్దకే కొనుగోళ్లతో కేసీఆర్ ప్రభుత్వంలో రైతుకు భరోసా కల్పించామన్నారు. కల్లోల కాంగ్రెస్ పాలనలో ధాన్యం కొనుగోళ్లు లేక రైతన్నలు నిత్యం ఆందోళనలు చేస్తున్నారని విమర్శించారు. జాగో తెలంగాణ జాగో అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## 2040కల్లా చంద్రుడి మీదకు భారత వ్యోమగామి



ఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2040 నాటికి చంద్రునిపై భారత వ్యోమగాములను పంపాలనే లక్ష్యంతో భారత్ అంతరిక్ష పరిశోధనలపై దృష్టిసారించినట్లు తెలిపారు. ఇందుకోసం, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇస్రో కోసం రికార్డు స్థాయిలో రూ. 31,000 కోట్ల నిధులను కేటాయించేందుకు ఆమోదించినట్లు తెలిపారు. తద్వారా రాబోయే 15 ఏళ్లలో చంద్రునిపై భారత వ్యోమగాములను పంపే ప్రయత్నాలకు అడుగులు పడినట్లు వెల్లడించారు. 'అంతరిక్ష పరిశోధనల్లో మేం ఈ ఏడాది అపూర్వ విజయాల్ని సాధించామని నమ్ముతున్నాం. అంతేకాదు అంతరిక్ష పరిశోదనల్లో ప్రధాని మోదీ కృషిని ప్రస్తావించారు. చరిత్రలో తొలిసారి రాబోయే 25 సంవత్సరాల్లో చేయాల్సిన ప్రయోగాలకు సంబంధించిన రోడ్ మ్యాప్‌ను ఇప్పటికే సిద్ధం చేసుకున్నట్లు' ఇస్రో చీఫ్ ఎస్ సోమనాథ్ జాతీయ మీడియా ఇంటర్వ్యూలో చెప్పారు. ఇందులో భాగంగా, 2035 నాటికి భారత్‌కు సొంతంగా స్పేస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తుంది. అంతకంటే ముందు 2028లో స్పేస్ స్టేషన్ మాడ్యూల్‌ను ప్రారంభించడం, 2035లో ఏర్పాటు చేయనున్న స్పేస్ స్టేషన్‌కు కార్యచరణను సిద్ధం చేయడం, 2040 నాటికి చంద్రునిపై భారతీయ వ్యోమగాముల్ని పంపే లక్ష్యాలు తమ విజన్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు.

# వీళ్లు వ్యాక్సిన్ వేశారు.. వాళ్లు బాంబులు వేశారు!

## తల్లిని కోల్పోయి.. కాళ్లను పోగొట్టుకుని గాజాలో చిన్నారుల ఆవేదనభరిత వ్యధ



గాజాలోని.. ఓ ఆస్పత్రి. 22 నెలల వయసున్న చెల్లెలు మిస్క్ తో కలిసి నాలుగు నెలలుగా ఆస్పత్రిలోనే ఉంటోంది మూడేళ్ల హనన్. 'అమ్మేది?', 'కాళ్లెక్కడికి పోయాయి'పదే పదే అడిగే ఈ ప్రశ్న తప్ప వారి నోటినుంచి మరో మాటలేదు. 'నాలుగు నెలలుగా మనమో పీడకలలో ఉన్నాం'అని చెబుతోంది పక్కనే ఉన్న వారి అత్త. బాంబు దాడిలో అమ్మ చనిపోయిందని, ఆ దాడిలోనే ఇద్దరి కాళ్లూ పోయాయని వాళ్లకు చెప్పలేక కుమిలిపోతోంది. ఇది గాజాలోని ఆస్పత్రుల్లో కనిపించే నిత్య దృశ్యం. మనుషులు వేరు.. అడిగే ప్రశ్నలు వేరు.. కానీ ఎవ్వరి దగ్గరా సమాధానాలు ఉండవు. తమ ప్రమేయం ఏమాత్రం లేకపోయినా.. జరుగుతున్న మారణహోమంలో ప్రాణాలు పోగొట్టుకున్న చిన్నారులు వేలమంది. వైకల్యం పాలైనవారి లెక్కలు లేనేలేవు. గాజాలో తొలి పోలియో కేసు నమోదు కావడంతో ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లలకు టీకాలు ఇచ్చేందుకు యుద్ధానికి విరామం ప్రకటించాలని సూచించింది. ఇజ్రాయెల్, గాజా రెండూ ఈ విరామాన్ని అంగీకరించాయి. సెప్టెంబర్ 2న కార్యక్రమం మొదలైంది. డేర్ ఎల్ బలాహ్‌లో ఉంటున్న షైమా అల్ దఖీ... ఉదయాన్నే లేచి తన ఇద్దరు కుమార్తెలు హనన్, మిస్క్‌ను తీసుకెళ్లి టీకా ఇప్పించింది. మరుసటి రోజు కుటుంబం భోజనం చేసింది.. నిద్రించడానికి ఉపక్రమిస్తుండగా.. వాళ్ల ఇంటిపై బాంబు దాడి. ఈ ఘటనలో షైమా ప్రాణాలు కోల్పోయింది. భర్త మహ్మద్ అల్ దఖీతో సహా ఇద్దరు పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. హనన్ రెండు కాళ్ళను కోల్పోయింది. ఆమె శరీరమంతా గాయాలే. చిన్నారి మిస్క్ ఎడమ కాలు కోల్పోయింది. తలలో తీవ్ర రక్తస్రావమవ్వడంతో మహమ్మద్ రెండు వారాలపాటు ఐసీయూలో ఉండాల్సి వచ్చింది.

### భయానకంగా భవిష్యత్...

మహమ్మద్ సోదరి షెఫా.. ఇద్దరు అమ్మాయిలను ఓదార్చడానికి ప్రయత్నిస్తోంది. ఇద్దరూ భయంతో వణికిపోతూ అత్తను పట్టుకునే ఉంటున్నారు. ఇప్పటికైతే ఏదో ఒకటి చెప్పి వారిని ఊరడిస్తోంది. కానీ.. భవిష్యత్‌లో పిల్లల పరిస్థితి ఏమిటి? తమ వయసులోని ఇతర పిల్లలను చూసి వీళ్లేమనుకుంటారు. లోకమంటే తెలియని మిస్క్‌కు అంత కష్టం కాకపోయినా.. తన కుటుంబానికి ఏం జరిగిందో కొంచెం అర్థమైన హనన్‌కు మాత్రం ఇది కష్టంగా ఉంది. పెరుగుతున్న బాధితులతో చికిత్స అందించడానికే సమయం సరిపోని వైద్యులకు చిన్నారులకు మానసికంగా మద్దతు ఇచ్చే అవకాశం అసలే లేదు. షెఫాతోపాటు షైమా తల్లిదండ్రులు, షెమా సోదరుడు అహ్మద్ పిల్లలను చూసుకుంటున్నారు. పిల్లలు బొమ్మలు కావాలంటున్నారు.. కానీ రొట్టెముక్క విలాసంగా మారిన చోట బొమ్మలు దొరకడం అసాధ్యం కదా! ఏచిన్న అవకాశం దొరికినా పిల్లలను సంతోషంగా ఉంచేందుకు కానుకలు తెస్తున్నారు.

### ఇతర పిల్లల కాళ్ల వైపు చూస్తూ..

"గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమైన నాటి నుంచే షైమా బిడ్డల గురించి భయపడింది. వారికి పోషకాహారం అందించడానికి ఎంతో శ్రమించింది. వారితోనే సమయం గడిపింది. వాళ్లు కావాలన్నది ఇవ్వడానికి ప్రయత్నించింది. పోలియో వ్యాక్సిన్ల ప్రకటన రాగానే.. పోలియో నుంచి రక్షణ కోసం వ్యాక్సిన్స్ తన పిల్లలకు వేయించడమే కాదు.. బంధువులందరినీ ప్రోత్సహించింది. కానీ ఏం జరిగింది. పోలియో నుంచి రక్షణ లభించింది కానీ.. ఇజ్రాయెల్ వైమానిక దాడి వారి కాళ్లను తీసుకుంది. షైమాను పొట్టన పెట్టుకుంది. తల్లి స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. హనన్‌ది నా కూతురు హలాది ఒకే వయసు. హలాను ఆస్పత్రికి తీసుకొచ్చినప్పుడు.. హనన్ భావాలను నేను ఎప్పటికీ మర్చిపోలేను. హలా కాళ్ల వైపు చూస్తూ, ఆ తర్వాత తన కాళ్లను చూసుకుంటూ ఉండిపోయింది. బాంబు దాడికి ముందు వాళ్లిద్దరూ కలిసి ఆడుకునేవారు. ఇప్పుడు ఆసుపత్రి మంచంపై ఆడుకుంటున్నారు"అంటూ కన్నీటి పర్యంతమవుతోంది షెఫా.

### వైద్యం కోసం ఎదురుచూపులు

బాంబుదాడులతో గాజా ఆరోగ్య వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైపోయింది. చిన్నారులిద్దరూ పూర్తిగా కోలుకోవాలంటే గాజాలో ఇచ్చే చికిత్స సరిపోదు. వాళ్లకు కేవలం ప్రోస్థెటిక్స్ అమరిస్తే సరిపోదు. పిల్లలిద్దరిదీ ఎదిగే వయసు. వయసుతో పాటు ఎముక పెరుగుదల కొత్త సమస్యలను తెచ్చిపెడుతుంది. అందుకే నిరంతర పర్యవేక్షణ, శస్త్రచికిత్సలు అవసరం. చికిత్స కోసం గాజాను విడిచిపెట్టాల్సిన వ్యక్తుల జాబితాలో వాళ్ల పేర్లను చేర్చారు. ఇజ్రాయెల్ ఆమోదిస్తే తప్ప వారిని విడిచిపెట్టలేరు. ఆమోదం కోసం మూడు నెలలుగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో 'నేను బూట్లెలా వేసుకోవాలి?', 'నేను ఆడుకోవడానికి పార్క్‌కు వెళ్లొద్దా?'అంటూ పిల్లలడిగే ప్రశ్నలకు బదులెవరు చెప్తారు? గాజాలో జరుగుతున్న మారణహోమాన్ని నిశ్శబ్దంగా చూస్తున్న ప్రపంచాన్ని భవిష్యత్‌లో ఆ చిన్నారులు ఎలా చూస్తారు? అంతటా సమాధానం లేని ప్రశ్నలే!

# పనామా వెనక్కి తీసుకుంటాం

## మరోసారి ట్రంప్ కవ్వింపు ప్రకటన
## తోసిపుచ్చిన పనామా అధ్యక్షుడు ములినో



ఫీనిక్స్: అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టకముందే ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ పొరుగుదేశాలపై కవ్వింపు చర్యలు మొదలుపెట్టారు. మిత్రదేశానికి తెలివితక్కువగా అప్పగించిన పనామా కాలువపై నియంత్రణను తిరిగి పొందడానికి తన కొత్త యంత్రాంగం ప్రయత్నిస్తుందని ట్రంప్ ప్రకటించారు. కీలకమైన ఈ రవాణా మార్గం గుండా వెళ్ళడానికి అత్యధిక రుసుము వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కాగా, ట్రంప్ ప్రకటనను పనామా కన్జర్వేటివ్ అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో తోసిపుచ్చారు. ఇది తమ దేశ సార్వభౌమత్వానికి అవమానమని కొట్టిపారేశారు. ఓవైపు ప్రభుత్వ షట్‌డౌన్‌ను నివారించడానికి కాంగ్రెస్ కృషి చేస్తుండగా.. ఫ్లోరిడాలోని తన రిసార్ట్ మార్-ఎ-లాగోలో ఉన్న ట్రంప్.. అక్కడినుంచే తేనెతుట్టలను కదుపుతున్నారు. అమెరికా ఫెస్ట్‌లో మద్దతుదారులను ఉద్దేశించి ఆదివారం ప్రసంగించారు. తాము అందరినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామన్న ట్రంప్.. విశ్వాసాన్ని కోల్పోయిన డెమొక్రాట్లు తమవైపు వస్తే స్వాగతిస్తామన్నారు. పనామా కాలువను తమ దేశం మూర?ంగా ఇచ్చేసిందని విచారం వ్యక్తం చేశారు. కాలువ విషయంలో అమెరికా పట్ల నైతిక, చట్టపరమైన సూత్రాలను పాటించకపోతే, కాలువను అమెరికాకు తిరిగి ఇవ్వాలని తాము డిమాండ్ చేస్తామన్నారు. తదనుగుణంగా అధికారులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. అదెలా సాధ్యమనే విషయాన్ని ఆయన వివరించలేదు. అంతేకాదు.. పనామా అధ్యక్షుడు ములినోను కన్జర్వేటివ్ జనాకర్షకుడని, పలు విషయాల్లో తనతో ఏకీభవిస్తారని ట్రంప్ అభివర్ణించారు.

### పనామా అంతా ఏకమవుతుంది: ములినో

ట్రంప్ ప్రకటనపై పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో స్పందించారు. ట్రంప్ ప్రసంగించిన కొద్దిసేపటికే 'ఆ కాలువలోని ప్రతి చదరపు మీటర్ పనామాకు చెందినదని, అది తమ దేశానికి చెందుతుందని ములినో ఓ వీడియోను విడుదల చేశారు. ట్రంప్ పేరును ప్రస్తావించకుండా, నిర్వహణ ఖర్చులు, సరఫరా, డిమాండ్‌లను పరిగణనలోకి తీసుకుని నిపుణుల కమిటీ పన్నులను నిర్ణయిస్తుందని ములినో అన్నారు. సుంకాలు ఇష్టానుసారంగా నిర్ణయించలేదని ములినో చెప్పారు. షిప్ ట్రాఫిక్‌ను పెంచడానికి పనామా కొన్ని సంవత్సరాలపాటు కాలువను విస్తరించిందని, రుసుముల పెరుగుదల కాలువ అభివృద్ధికే ఉపయోగిస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాదు.. పనామావాసులు ఇతర అంశాలపై భిన్నమైన అభిప్రాయాలను కలిగి ఉండవచ్చని, కానీ కాలువ, సార్వభౌమాధికారం విషయానికి వస్తే... పనామా అంతా ఏకమవుతుందని స్పష్టం చేశారు.

### పనామా కాలువపై ఎందుకీ వివాదం..

పనామా.. అమెరికాకు మిత్రదేశం. ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు ఈ కాలువ కీలకమైనది. ఆ ప్రభుత్వ వార్షిక ఆదాయంలో ఐదోవంతు దీనినుంచే వస్తుంది. తన తీరాల మధ్య వాణిజ్య, సైనిక నౌకల రవాణాను సులభతరం చేయడంలో భాగంగా అమెరికా 1900ల ప్రారంభంలో ఈ కాలువను నిర్మించింది. 1977లో అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ సంతకం చేసిన ఒప్పందం ప్రకారం 1999 డిసెంబర్ 31న పనామా కాలువపై నియంత్రణను అమెరికా కోల్పోయింది. 2023లో మధ్య అమెరికా కరువుల వల్ల కాలువ తీవ్రంగా ప్రభావితమైంది. సరిపడా జలాలు లేక నౌకలు దాటే స్లాట్ల సంఖ్యను గణనీయంగా తగ్గించాల్సి వచ్చింది. దీంతో కాలువ దాటేందుక వసూలు చేసే రుసుమును కూడా పెంచారు. ఈ ఏడాది చివరి నెలల్లో వాతావరణం సాధారణ స్థితికి చేరుకోవడంతో కాలువపై రాకపోకలు యథాస్థితికి చేరుకున్నాయి. రుసుములు యథాస్థితిలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ 'నియంత్రణ'వ్యాఖ్యలు చేశారు

# భగీరథకు టోల్ ఫ్రీ




హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి సర్కారు ముందడుగేసింది. వేసవికి మూడు నెలల ముందుగా స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించే ప్రయత్నం చేస్తున్న పంచాయతీరాజ్ శాఖ, తాజాగా టోల్‌ఫ్రీ నెంబరును కేటాయించింది. పల్లెల్లో తాగునీటి ఇబ్బందులు ఉంటే 1800-599-4007 నెంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించింది. ఇందుకుగాను ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఎస్ఈ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల బృందాన్ని పర్యవేక్షణ కోసం నియమించింది. సోమవారం నుంచే ఈ టోల్ ఫ్రీ నెంబరు అమల్లోకి వచ్చింది. తొలి రోజు ఆయా జిల్లాల నుంచి తొమ్మిది ఫిర్యాదులు అందాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులు, సమస్యలపై ఎప్పటికప్పుడు సర్కారు దృష్టికి తీసుకుపోయే అవకాశం కలిగింది. 24గంటల పాటు కాల్ సెంటర్ పనిచేయనుంది. పగటిపూట వచ్చే ఫోన్ కాల్స్‌ను భగీరథ కార్యాలయం సిబ్బంది అటెండ్ చేసి వివరాలు నమోదు చేసుకుంటారు. రాత్రి వచ్చే కాల్స్ రికార్డు అవుతాయి. ప్రతిరోజూ వచ్చే ఫిర్యాదులను మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్ కపాకర్‌రెడ్డి సమీక్షించి 24 గంటల్లో సమస్య పరిష్కారమ య్యేలా చర్యలు తీసుకుం టారు. టోల్ ఫ్రీ ద్వారా అందే ఫిర్యాదులను క్షేత్ర స్థాయికి చేరవేసి పరిష్కారానికి అవసరమైన సలహాలు, సూచనలు చేస్తారు. అంతేగాక రాష్ట్ర కార్యాలయం సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఉంటారు. పంచాయతీరాజ్, మిషన్ భగీరథ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సైతం పలుమార్లు సమీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అనంతరమే టోల్‌ఫ్రీ ఆలోచ న చేసినట్టు మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపా యి. మిషన్ భగీరథ నీటిపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టను న్నారు. నీటి సరఫరాలో లీకేజీలు, ఆటంకాలను అరికట్టే లక్ష్యంగా టోల్‌ఫ్రీని ఏర్పాటు చేశారు. ఫిర్యాదుల స్వభావం ఆధారంగా కీలక నిర్ణయా లు తీసుకునే అవకాశం కనిపిస్తున్నది. తాగునీటి సరఫరా సజావుగా సాగేలా చూసేందుకు గ్రామాల్లో మంచినీటి సహాయకుల నియామకం చేయనున్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా తక్షణం రంగంలోకి దిగి మరమ్మతులు చేసేలా సహాయకులకు పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వనున్నారు. మిషన్ భగీరథ సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీటి సరఫరా చేసేందుకు సైతం ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. 64,218 చేతి పంపులు, 45,882 సింగల్ ఫేజ్ మోటార్లు, 32,517 పైపులకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవడానికి మిషన్ భగీరథ శాఖ కృషి చేస్తున్నది. తాజాగా మిషన్ భగీరథలో కాల్‌సెంటర్ ఏర్పాటుతో గ్రామీణ నీటిసరఫరా సమస్యలకు చెక్ పడే అవకాశాలు ఉన్నాయి.

తొలిరోజు తొమ్మిది ఫిర్యాదులు

భగీరథ టోల్‌ఫ్రీ నెంబరు మొదటి రోజు ఆయా జిల్లాల నుంచి తొమ్మిది ఫిర్యాదులు అందాయి. భగీరథ నీరు రావడం లేదనీ, కొన్ని మరమ్మతులు చేయాలనీ, పైపులను శుభ్రం చేయాలంటూ టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్‌చేశారు. నల్లగొండ, జగిత్యాల నుంచి ఇద్దరి చొప్పున, మహబూబాబాద్, జయశంకర్ -భూపాలపల్లి, సూర్యాపేట, మహబూబ్‌నగర్, మెదక్, మంచిర్యాల, ములుగు జిల్లాల నుంచి ఒకరు చొప్పున ఫోన్లు చేశారు. వీటిని వెంటనే పరిష్కరించాలని ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

# వాళ్లకు ఉచిత వైద్యం అందించాల్సిందే

## ఢిల్లీ హైకోర్టు సంచలన ఆదేశాలు




న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. అత్యాచారం, యాసిడ్ దాడులు, లైంగిక దాడులు, పోక్సో (లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ) కేసుల బాధితులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం పొందేందుకు అర్హులని ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించారు. మంగళవారం తండ్రి కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ ఆరోపిస్తూ దాఖలైన పోక్స్ కేసు ఢిల్లీ హైకోర్టులో విచారణ జరిగింది. విచారణ సందర్భంగా ధర్మాసనం పై విధంగా వ్యాఖ్యానించింది. అత్యాచారం, యాసిడ్ దాడి బాధితులకు ఉచిత వైద్యం అందించాలని, అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పనిచేసే సంస్థలు, ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు నర్సింగ్‌హోమ్‌లు తప్పని సరిగా ఈ ఆదేశాలను పాటించాలని జస్టిస్ ప్రతిభా ఎం. సింగ్ జస్టిస్ అమిత్ శర్మలతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చింది. అలాగే పోక్సో సంబంధిత కేసుల్లో.. బాధితులకు తక్షణ వైద్య సంరక్షణ, అవసరమైన సేవలు అందించాలని సూచించింది. బాధితులకు అందించే ఉచిత వైద్యంలో ప్రథమ చికిత్స, రోగ నిర్ధారణ, ఇన్‌పేషెంట్ కేర్, ఔట్ పేషెంట్ ఫాలో అప్‌లు, రోగనిర్ధారణ, సంబంధిత పరీక్షలు, అవసరమైతే శస్త్రచికిత్సలు, ఫిజకల్,మెంటల్ కౌన్సెలింగ్,ఫ్యామిలీ కౌన్సిలింగ్ సైతం వస్తాయని కోర్టు స్పష్టం చేసింది.

# అమిత్ షా వ్యాఖ్యలు: కౌన్సిలర్ల డిష్యూం..

## డిష్యూం.. 20ని. వీడియో వైరల్



చండీగఢ్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హెూంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యల వేడి ఇంకా చల్లారలేదు. ఈలోపు.. మంగళవారం చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశం రసాభాసగా మారింది. షా వ్యాఖ్యల నేపథ్యంతో.. కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గత వారం రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ సందర్భంగా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలతో అమిత్ షా రాజీనామా చేయాలంటూ చండీఘడ్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ కౌన్సిలర్లు తమ ఆమోదాన్ని తెలిపారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ కౌన్సిలర్లు జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో బీఆర్ అంబేద్కర్‌కు అవమానం జరిగిందని ఆరోపించారు. దీంతో కౌన్సిలర్లు మధ్య తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. దాదాపు 20 నిమిషాల పాటు కౌన్సిలర్లు భౌతికంగా కలబడ్డారు. అయితే జనవరి 30న నిర్వహించిన చండీగఢ్ మేయర్ ఎన్నికలో రిటర్నింగ్ అధికారి, నామినేటడ్ కౌన్సిలర్ అనిల్ మసీహ్ వివాదాస్పదంగా వ్యవహరించారు. రిటర్నింగ్ అధికారి బ్యాలెట్ పత్రాలను తారుమారు చేసేందుకు ఉద్దేశపూర్వంగా వ్యవహరించారని స్పష్టంగా తేలింది. దీనిపై సుప్రీం కోర్టు అనిల్ మసీహ్‌పై అంక్షితలు వేసింది. మున్సిపల్ సమావేశంలో బీజేపీ నుంచి నామినేటెడ్ కౌన్సిలర్‌గా ఉన్న అనిల్ మసీహ్‌ను కాంగ్రెస్ కౌన్సిలర్లు నాటి ఘటనను ప్రస్తావిస్తూ ఎన్నికల దొంగ అంటూ సంభోదించారు. బదులుగా అనిల్ మసీహ్ సైతం.. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ నేషనల్ హెరాల్డ్ కేసులో బెయిల్‌పై బయట తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. దీంతో కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు ఘర్షణకు దారి తీసింది.

# "గుంట నక్కల్లా వ్యవహరించడం వైఎస్సార్‌సీపీకి తెలియదు"



గుంటూరు:మాజీ ఎంపి నందిగాం సురేష్ అక్రమ కేసుల్లో అరెస్టై నాలుగు నెలలు అవుతోందని, ఆధారాలు లేకుండా సురేష్‌పై కేసులు పెట్టారని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం(డిసెంబర్ 24) గుంటూరు జైలులో సురేష్‌ను పరామర్శించిన తర్వాత సజ్జల మీడియాతో మాట్లాడారు.'ఈ రోజు టీడీపీ వ్యవహరించినట్లు మేము వ్యవహరించి ఉంటే ఈ కేసులు అప్పుడే తీసేసుకునేవాళ్ళం. మా పాలనలో చట్టం తన పని తాను చేసుకుని వెళ్ళింది. కోర్టుల్లో ఉన్న లొసుగులను ఉపయోగించి జైల్లో ఉంచుతున్నారు. జైల్లో మాజీ ఎంపీకి కనీస సదుపాయాలు కల్పించడం లేదు. వాటర్ బాటిల్ కూడా అనుమతించడం లేదు. నేరుగా సీఎం కొడుకే ఫోన్ చేసి సురేష్‌ను ఎలా ఉంచాలి?అనేది చెబుతున్నారు.ఇవన్నీ కూడా మౌనంగానే భరిస్తున్నాం. వైఎస్సార్‌సీపిని లేకుండా చేయాలని కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన మహిళలను అరెస్ట్ చేస్తున్నారు. గతంలో ముప్పై ఏళ్ళ క్రితం నక్సలైట్లను అరెస్ట్ చేసినట్లు సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టిన వారిని అరెస్ట్ చేస్తున్నారు. వేధించడం అంటే ఎలా ఉండాలో మాకు నేర్పుతున్నారు. ప్రజలు ఇచ్చిన అధికారం ప్రజల కోసమే ఉపయోగించాలి. కూటమి ప్రభుత్వం కక్ష తీర్చుకోవడంలో కొత్తకొత్త పద్దతులు ఉపయోగిస్తున్నారు. గుంట నక్కల్లా వ్యవహరించడం వైఎస్సార్‌సీపీకి తెలియదు. మీ కంటే బలంగా కొట్టగలిగే శక్తి వైఎస్సార్‌సీపీకి ఉంది. నాలుగేళ్ళలో మేము అధికారంలోకి వస్తే మా వాళ్ళు చెప్పినా కూడా వినే పరిస్థితి ఉండదు'అని సజ్జల హెచ్చరించారు.

# ఆంధ్రప్రదేశ్ సీఎం కూడా టికెట్ రేట్లపై నిర్ణయం తీసుకోవాలి



హైదరాబాద్: ప్రస్తుతం తెలుగు సినీ పరిశ్రమలో అల్లు అర్జున్ వివాదం చర్చనీయాంశంగా మారింది. రెండు రోజుల క్రితం అసెంబ్లీలో మాట్లాడిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. పరోక్షంగా అల్లు అర్జున్‌పై విమర్శలు చేశారు. తాను సీఎంగా ఉన్నంతవరకు ఇకపై రాష్ట్రంలో బెనిఫిట్ షోలు, టికెట్ రేట్ల పెంపు ఉందని ఖరాఖండీగా చెప్పారు. ఈ నిర్ణయాన్ని ఇప్పటికే తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ స్వాగతించగా.. తాజాగా ఆంధ్రప్రదేశ్ తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి కూడా స్వాగతించారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఏ సినిమాలకు బెనిఫిట్ షో ఉండవని ముఖ్యమంత్రి ప్రకటన చేయడం హర్షాదాయకం. ఈ నిర్ణయంపై సగటు ప్రేక్షకులు, పరిశ్రమను నమ్ముకున్న ఎందరో తమ సంతోషం వ్యక్తపరిచారు. తెలంగాణ ఫిల్మ్ ఎగ్జిబిటర్స్ కూడా ఈ నిర్ణయం ఎంతో సంతోషం కలిగించింది. ఇన్నేళ్లు అధికారంలోని ప్రభుత్వాలు పెంచిన ధరల వల్ల థియేటర్లుకు వచ్చే ప్రేక్షకులు తగ్గారు. ఇప్పుడు ఈ నిర్ణయం వలన సగటు ప్రేక్షకుడు సినిమా థియేటర్లకు కుటుంబ సభ్యులతో సంతోషంగా వస్తారు. అలానే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా ఇలాంటి నిర్ణయం తీసుకొని చలనచిత్ర పరిశ్రమ ఉనికిని కాపాడాలి. ఒక కుటుంబం.. సినిమా అనే వినోదాన్ని సగటు ధరలను చెల్లించి చూసే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రతి సినిమాకు రేట్స్ పెంచే విధానానికి స్వస్తి పలకాలి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా చిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందేలా కొన్ని మార్గదర్శకాలు నిర్దేశించుటకు.. నిపుణుల కమిటీని నియమిచి అ తర్వాత నిర్ణయాలు తీసుకోవాలని కేతిరెడ్డి కోరారు.

# పారదర్శకతకు పాతర




కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) వ్యవహారశైలిపై, దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియపై అనేక అనుమానాలు తలెత్తుతున్న వేళ... అవి మరింత పెరిగే ప్రమాదం తాజాగా తలెత్తింది. ఎన్నికల నిర్వహణ నిబంధనల్ని మారుస్తున్నట్టు కేంద్ర సర్కార్ శుక్రవారం ప్రకటించింది. నిబంధనల్లో సరికొత్త సవరణ వల్ల ఇకపై ఎన్నికలకు సంబంధించిన అన్ని పత్రాలనూ పరిశీలించే అవకాశం ప్రజలకు ఉండదు. సీసీ టీవీ, వెబ్‌కాస్టింగ్ ఫుటేజ్, అభ్యర్థుల వీడియో రికార్డింగుల లాంటి ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు ఇకపై అందుబాటులో ఉండవు. అదేమంటే, అలాంటివన్నిటినీ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంచితే వాటిని దుర్వినియోగం చేస్తారనీ, అసలు ఓటరు భద్రతకే ప్రమాదకరమనీ పాలక వర్గాల వాదన. సోషల్ మీడియా యుగంలో, పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్ల దృశ్యాలు విస్తృతంగా అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో అది వట్టి డొల్ల వాదనే. ఎన్నికల నిబంధనల్లో మార్పుపై దేశ వ్యాప్తంగా అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నది అందుకే! "ఎన్నికకు సంబంధించిన మిగిలిన అన్ని పత్రాలనూ ప్రజాక్షేత్రంలో పరిశీలించేందుకు వీలుండాలి" అని 1961 నాటి ఎన్నికల నిర్వహణ నిబంధనల్లోని రూల్ 93(2)(ఎ) చెబుతోంది. దానికే ఇప్పుడు సవరణ చేశారు. ఈసీ సిఫార్సు మేరకు, కేంద్ర న్యాయశాఖ ఈ మార్పును నోటిఫై చేసింది. దాంతో, ఇప్పుడిక నిబంధనల్లో ప్రత్యేకంగా పేర్కొన్న పత్రాలను మాత్రమే జనం పరిశీలించవచ్చన్న మాట. అంతేకాదు... ఎన్నికల పత్రాలన్నిటినీ కోరినవారికి ఇవ్వాలంటూ ఈసీని ఇక కోర్టులు ఆదేశించడానికి వీలుండదు. చిత్రమేమంటే, ఇటీవలి హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓ పోలింగ్ కేంద్రంలో పోలైన ఓట్లకు సంబంధించిన పత్రాల కాపీలు, సెక్యూరిటీ కెమెరాలోని ఫుటేజ్, వీడియోలను ఓ పిటిషనర్‌కు అందించాల్సిందిగా పంజాబ్ – హర్యానా హైకోర్ట్ సరిగ్గా ఈ నెల 9వ తేదీనే ఆదేశా లిచ్చింది. అక్టోబర్ నాటి ఎన్నికల్లో అభ్యర్థి కాదు గనక సదరు పిటిషనర్ ఆ పత్రాలు కోరరాదని ఈసీ వాదించింది. హైకోర్ట్ మాత్రం అభ్యర్థికైతే ఉచితంగా, ఇతరులకైతే రుసుముపై పత్రాలివ్వాలన్న పిటిషనర్ వాదనతో ఏకీభవించింది. కోర్టు ఆదేశాన్ని తప్పక పాటించాల్సిన పరిస్థితి. కానీ, తద్భిన్నంగా ఎన్నికల సంఘం నిబంధనల్ని సవరించడం సహజంగానే చర్చనీయాంశమవుతోంది.

ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎలక్టోరల్ బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని ప్రకటిస్తున్నప్పుడే, సామాన్య ఓటర్లకున్న తిరుగులేని సమాచార హక్కును సుప్రీమ్ కోర్ట్ నొక్కి వక్కాణించింది. రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే వ్యక్తుల, సంస్థల వివరాలు తెలుసుకొనే హక్కు ప్రజలకుందని తేల్చి చెప్పింది. వివాదాస్పద బాండ్ల పథకాన్ని సమర్థించిన సర్కారుకు అది ఎదురుదెబ్బ. నిజానికి, ఎన్నికల ప్రక్రియ పారదర్శకత, నిజాయతీలో రాజీకి తావు లేదని దేశ సర్వోన్నత న్యాయస్థానం అప్పుడే స్పష్టం చేసినట్టయింది. అయినా సరే, ప్రభుత్వం చెవికెక్కించుకోకుండా ఇప్పుడు ఈసీ సిఫార్సు పేరు చెబుతూ, నిబంధనల సవరణకు దిగడం ప్రజాస్వామ్యవాదులకు దిగ్భ్రాంతి కలిగించే విషయం. ఓటర్లే స్వయంగా తమ ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియా సాక్షిగా పంచుకుంటున్న రోజుల్లో సీసీ టీవీ దృశ్యాల పట్ల ఈసీ ఇంత హంగామా ఎందుకు చేస్తోందో అంతుపట్టదు. సీసీ టీవీ ఫుటేజ్ అందుబాటులో ఉంటే కృత్రిమ మేధతో దుర్వినియోగం చేసే ముప్పుందన్న ఈసీ వాదన కొంత నిజమైనా, డిజిటల్ యుగంలో అన్ని వీడియోలపై నిషేధం పెడతామా? సవాలుకు అది పరిష్కారం కాదు కదా! ఎన్నికల సంఘం సారథ్యంలో నిఖర్సుగా సాగాల్సిన ఎన్నికల ప్రక్రియ తాలూకు నైతిక నిష్ఠ శరవేగంగా హరించుకుపోతోందంటూ ప్రతిపక్షాలు అసలే గొంతు చించుకుంటున్న సమయంలో నిబంధనల్లో ఈ కొత్త సవరణలు చేయ డాన్ని ఏ రకంగా అర్థం చేసుకోవాలి? ఎన్నికల రికార్డులనూ, డేటాను ప్రజాక్షేత్రానికి దూరంగా ఉంచాలన్న జ్ఞానోదయం హఠాత్తుగా పాలకులకూ, ఈసీకీ ఎందుకు కలిగినట్టు? జనం దృష్టి నుంచి ఏం దాచాలని చూస్తున్నారు? ప్రతిపక్షాలనే కాదు... పౌరులనూ వేధిస్తున్న ప్రశ్నలివి. పైగా విస్తృత స్థాయి చర్చ జరగకుండానే చేపట్టిన ఈ తొందరపాటు చర్య ఎన్నికల ప్రక్రియపై మరిన్ని అనుమానాలు పెంచేలా పరిణమిస్తుంది. ప్రజాస్వామ్య దేశంలో అది మరింత విషాదం. వాస్తవానికి భిన్న భౌగోళిక పరిస్థితులు, భాషలు, సంస్కృతులు, సమస్యలున్న సువిశాల దేశంలో అతి పెద్ద ప్రజాస్వామ్య ప్రక్రియగా ఇన్నేళ్ళుగా విజయవంతంగా ఎన్నికలను నిర్వహిస్తూ రావడం గొప్పే. అందుకు మన రాజ్యాంగం ఏర్పరచిన సుస్థిర వ్యవస్థనూ, గత దశాబ్దాల్లో ఈసీ పాత్రనూ తప్పక ప్రశంసించాల్సిందే. కానీ ఏ ఎన్నికల ప్రక్రియకైనా పారదర్శకత ప్రాణాధారం. ప్రజాస్వామ్యం పరిఢవిల్లడానికీ అదే కీలకం. తీరా ఆ పారదర్శకతే ఇప్పుడు రానురానూ తగ్గుతూ పోతుంటే ఏమనాలి? ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్యంగా గొప్పలు చెప్పుకొనే మనం ఎటువైపు ప్రయాణిస్తున్నట్టు? అందులోనూ ఆంధ్రప్రదేశ్, హర్యానా సహా అనేక చోట్ల ఎన్నికల్లో ఈవీఎంలపై, వీవీప్యాట్లపై నీలినీడలు కమ్ముకున్న ప్రస్తుత పరిస్థితుల్లో... ఈ తరహా కొత్త నిబంధనతో పాలకులు ఏ రకమైన సూచన ఇవ్వదలిచినట్టు? ఎన్నికల ప్రక్రియ పట్ల విశ్వాసం పాదుకొనాలంటే, ఈ సరికొత్త నిబంధనల మార్పును పునఃపరిశీలించాలి. స్వతంత్రంగా సాగాల్సిన ఈసీ పాలకుల చేతిలో మరబొమ్మగా మారిపోతున్నట్టు విమర్శలు పెల్లుబుకుతున్న సందర్భంలో అది అత్యవసరం.

# వాట్సాప్‌పై దాడులకు ఇజ్రాయిల్ కంపెనీయే కారణం

## అమెరికా న్యాయస్థానం నిర్ధారణ

## పెగాసస్ స్పైవేర్‌ను విక్రయించింది ఆ సంస్థే

వాషింగ్టన్ : వాట్సాప్‌పై దాడులకు పాల్పడింది పెగాసస్ స్పైవేర్‌ను విక్రయించిన ఇజ్రాయిల్ ఎన్ఎస్ఓ గ్రూపేనని అమెరికా జిల్లా కోర్టు నిర్ధారించింది. 2019లో వాట్సాప్ యాప్ వేసిన దావాను పురస్కరించుకొని న్యాయస్థానం ఈ మేరకు తీర్పు చెప్పింది. యాప్‌కు చెందిన 1,400 పరికరాలలో (డివైస్‌లు) ఉల్లంఘనలు జరిగాయని వాట్సాప్ ఫిర్యాదు చేసింది. అమెరికా కంప్యూటర్ ఫ్రాడ్ అండ్ అబ్యూస్ యాక్ట్ (సీఎఫ్ఏఏ)ను, వాట్సాప్‌నకు చెందిన సొంత సర్వీసు నిబంధనలను ఎన్ఎస్ఓ ఉల్లంఘించిందని న్యాయమూర్తి ఫిలిస్ హామిల్టన్ తేల్చారు.

### న్యాయమూర్తి ఏమన్నారు?

'తన క్లయింట్లు వాట్సాప్ అప్లికేషన్ ఆధునిక వెర్షన్‌ను ఉపయోగించుకునేందుకు ఎన్ఎస్ఓకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు (పెగాసస్) అనుమతించాయి. ఈ ఆధునిక వెర్షన్‌ను వాట్సాప్ ఇన్‌స్టాలేషన్ సర్వర్ లేదా డబ్ల్యూఐఎస్ అని పిలుస్తారు. ఎన్ఎస్ఓ క్లయింట్లు సిఫర్ ఫైల్స్‌ను పంపేందుకు ఈ సర్వర్ ఉపకరిస్తుంది. సిఫర్ ఫైల్స్ సాయంతో క్లయింట్లు తాము ఎంచుకున్న వినియోగదారులపై నిఘా పెట్టవచ్చు. ఇది సీఎఫ్ఏఏను, కాంట్రాక్ట్‌ను ఎన్ఎస్ఓ ఉల్లంఘించడమే అవుతుందని వాట్సాప్ ఫిర్యాదు చేసింది' అని న్యాయమూర్తి వివరించారు. కోర్టు ఆదేశాలను పాటించడంలో ఎన్ఎస్ఓ విఫలమైందని కూడా ఆయన తెలిపారు. పెగాసస్ సోర్స్ కోడ్ కేవలం ఇజ్రాయిల్‌లో నివసిస్తున్న ఆ దేశ పౌరులకు మాత్రమే అందుబాటులో ఉంటుందంటూ ఎన్ఎస్ఓ చేసిన వాదన ఆచరణ సాధ్యం కాదని న్యాయస్థానం అభిప్రాయపడింది.

### గోప్యతకు లభించిన భారీ విజయం : వాట్సాప్

కోర్టు తీర్పుపై వాట్సాప్ అధినేత విల్ కాథ్‌కార్ట్ హర్షం వ్యక్తం చేశారు. ఈ తీర్పు గోప్యతకు లభించిన భారీ విజయమని ఆయన అభివర్ణించారు. 'మా వాదనలు వినిపించేందుకు ఐదు సంవత్సరాల సమయం తీసుకున్నాము. ఎందుకంటే స్పైవేర్ కంపెనీలు తమ చట్ట



వ్యతిరేక కార్యకలాపాల నుంచి ఎలాంటి రక్షణ పొందలేరు. వాటికి జవాబుదారీతనం ఉండదు. అక్రమ గూఢచర్యాన్ని సహించరాదన్న వాస్తవాన్ని నిఘా కంపెనీలు గుర్తుంచుకోవాలి. ప్రజల ప్రైవేటు సంభాషణలకు రక్షణ కల్పించే విషయంలో వాట్సాప్ ఎప్పుడూ వెనకడుగు వేయదు' అని ఆయన తెలిపారు. కాగా ఈ వ్యవహారంలో జరిగిన నష్టానికి సంబంధించిన కేసు విచారణ వచ్చే సంవత్సరం ప్రారంభమవుతుందని న్యాయమూర్తి చెప్పారు.

### పెగాసస్‌పై దేశంలో దుమారం

మన దేశంలో పెగాసస్ వినియోగంపై 'ది వైర్' పోర్టల్ సహా పలు అంతర్జాతీయ వార్తా సంస్థలు కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే. ఎన్ఎస్ఓ గ్రూప్ తన స్పైవేర్‌ను కొన్ని ప్రభుత్వాలకు మాత్రమే అందజేసిందని వార్తా సంస్థల అంతర్జాతీయ కన్సార్టియం తెలిపింది. దేశ భద్రతకు సంబంధించిన కేసులు, నేరాలపై పరిశోధనలు జరుపుతున్న క్లయింట్లు మాత్రమే పెగాసస్‌ను ఉపయోగిస్తున్నారని, కాబట్టి తమను బాధ్యులను చేయరాదని ఎన్ఎస్ఓ కంపెనీ అమెరికా కోర్టులో విచారణ సందర్భంగా వాదించింది. అయితే ఈ వాదనను జడ్జి తోసిపుచ్చారు. 2021లో మీడియా సంస్థలు పరిశోధనలు జరిపినప్పుడు తన వినియోగదారుల జాబితాను బయటపెట్టేందుకు ఎన్ఎస్ఓ నిరాకరించింది. అయితే పెగాసస్ స్పైవేర్ సాయంతో ప్రతిపక్ష నేతలు, పాత్రికేయులు, న్యాయవాదులు, హక్కుల కార్యకర్తలను లక్ష్యంగా చేసుకున్న విషయం విదితమే. మీడియా సంస్థలు బయటపెట్టిన అంశాలపై విచారణ జరపాలని 2021లో సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనిపై ఏర్పడిన సాంకేతిక కమిటీ ఐదు ఫోన్లలో మాల్‌వేర్‌ను గుర్తించింది. అయితే అది పెగాసస్ అవునా కాదా అనేది చెప్పలేదు. పెగాసస్ స్పైవేర్‌ను కొనుగోలు చేసి దానిని వినియోగించానా లేదా అనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ధృవీకరించలేదు. అలాగే తోసిపుచ్చనూ లేదు.

# స్వంతపాట మాని వంతపాట



"పీల్చే ముందు ఒకసారి గాలిని కూడా తనిఖీ చెరు లేదా ఈ గాలిలో ఎన్ని రాజకీయాలో, ఎన్ని అరాచకీయాలో" అంటాడు అలిశెట్టి ప్రభాకర్. కానీ, దీనికి స్వయం ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థయిన ఎన్నికల సంఘం కూడా మినహాయింపు కాదా? అన్నది ఇప్పుడు అందరి మెదళ్లనూ తొలుస్తున్న సమస్య! తన నైతిక ప్రవర్తనా నియమావళికి ఎన్నికల సంఘం ప్రతిపాదిస్తున్న సవరణలే ఈ సందేహానికి కారణం. ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో ఎన్నికల సంఘం(ఈసీ) మార్పులు చేయడానికి పూనుకుంది. దేశంలో ఎన్నికల నిర్వహణలో పూర్తి పారదర్శకత తీసుకురావాలని, అనుమానాలకు తావులేని విధంగా ఎన్నికలు నిర్వహించాలని ప్రజాస్వామ్యవాదులు డిమాండ్ చేస్తుంటే, వాటిని తుంగతోకి తొక్కుతూ కేంద్ర ప్రభుత్వం గోప్యతకే ప్రాధాన్యం ఇస్తోంది. ఎన్నికల ప్రక్రియను మరింత రహస్యంగా మార్చే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. ఇది ఒక రకంగా రాజకీయ పార్టీల హక్కులను హరించడమే అవుతుంది. దేశంలో ప్రజాస్వామిక విలువలను వమ్ము చేయడమే గాక రాజ్యాంగ వ్యవస్థల స్ఫూర్తిని కూడా దెబ్బతీస్తూ నరేంద్రమోడీ ప్రభుత్వం నిరంకుశ చర్యలకు పాల్పడుతూనే ఉంది. ఈ క్రమంలో బాహాటంగా బరితెగించి వ్యవహరించినవి కొన్నయితే, అచ్చంగా చట్టబద్ధంగా చట్టం కోసమే చేస్తున్నట్టు నటిస్తూ చాపకింద నీరులా తమ పని చక్కబెట్టుకునేవి మరికొన్ని. ఎన్నికల నిర్వహణతో పాటు పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించిన ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు (సీసీటీవీ కెమెరా ఫుటేజీ, వెబ్‌కాస్టింగ్ ఫుటేజీ లాంటివి), వీడియో రికార్డింగ్‌లను సామాన్య ప్రజలు తనిఖీ చేసేందుకు వీల్లేకుండా ఎన్నికల నిబంధనల్లో సవరణలు తీసుకోస్తోంది. అధికారపక్షం కుట్రలు బయటకు రాకుండా చేసేందుకు ఈ నిషేధం విధించింది. ఇవన్నీ చూస్తుంటే ఈసీ తన స్వతంత్రతనుకోల్పోతోందనిస్పష్టమవుతోంది. ఎలాంటి ప్రలోభాలకూ, అనైతికప్రభావాలకూ, అక్రమాలకూ అవకాశమివ్వకుండా అత్యంత పారదర్శకంగా, స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహిం చడం ఎన్నికల సంఘం బాధ్యత. కానీ అవాంఛ నీయమైన రాజకీయ జోక్యాలతో ఎన్నికల సంఘం డూడూ బసవన్నలా తలాడించే వారితో నిండిపోతోంది. చివరికి ఎన్నికల్లో ఆ స్వేచ్ఛా, పారదర్శకతలే కొడిగట్టిన దీపాలవుతున్నాయి. మూడో దఫా మోడీ పాలనలో అది మరింత తీవ్రమై ఎన్నికల సంఘమంటే ఏలినవారి వ్యూహాలకు గుడ్డిగా తలాడించే కీలుబొమ్మగా మారింది. ఇందుకు ఉదాహరణలు కోకొల్లలు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తూ, భారత సమాఖ్య స్ఫూర్తికి సమాధి కట్టే వివాదాస్పద 'జమిలి ఎన్నికల' అంశం ఇప్పటికే జేపీసీ ముందు ఉంది. ఈ తరుణంలో ఉన్నట్టుండి ఈ సవరణకు ఉరుకులాడటం ఆశ్చర్యానికే కాదు, పలు అనుమానాలకూ, ఆందోళనలకూ గురిచేస్తోంది. ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తినే సందేహాస్పదంగావిస్తోంది. ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో ఉన్న అంశాలే అనేకం అమలుకు నోచుకోవడం లేదు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావాలను ఈసీ నియంత్రించలేక పోతోంది. ఎన్నికల్లో కుల మత విభజనలనూ, విద్వేషాలనూ అడ్డుకట్టు వేయలేక పోతోంది. నేర స్వభావం గల నేతలను పోటి నుంచి నివారించలేకపోతోంది. తన నియంత్రణలోని అతిక్రమణలనే అడ్డుకోలేని ఎన్నికల సంఘం, తాజా నింబంధనలకు ప్రయత్నించడం అవాంఛనీయం, రాజ్యాంగ విరుద్ధం. వాటన్నిటినీ వదిలేసి ఏలినవారి ఆలోచనలకు ఊడిగం చేయడానికి వ్యవస్థలు దిగజారితే అంతకన్నా విషాదమేముంటుంది? కేంద్ర సర్కార్ తీరు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ఎన్నికల సంఘంపై కేంద్ర ప్రభుత్వ పెత్తనం ఏమాత్రం శ్రేయస్కరం కాదు. భారతదేశ ఎన్నికల కమిషన్‌కు ప్రపంచంలోనే అత్యంత పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. దాని పనితీరును ప్రపంచదేశాలు అనేక సందర్భాల్లో శ్లాఘించాయి. ఇంతటి గొప్ప నేపథ్యం ఉన్న ఎన్నికల కమిషన్‌ను మోడీ ప్రభుత్వం తమ కనుసన్నల్లో పెట్టుకోవాలని చూడటం ప్రజాస్వామ్యానికి విఘాతం. ఈసీ విధుల్లో మోడీ ప్రభుత్వం జోక్యం మానుకోవాలి. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున వ్యతిరేకత పెల్లుబుకుతుందనడంలో సందేహమే లేదు. కేంద్రం వ్యవస్థలను లోబరుచుకుని దొడ్డిదారిన తన ప్రయోజనాలను సాధిస్తానంటే అది ఎలా సమంజస మవుతుంది? దీనికి వంతపాడితే వ్యవస్థల స్వతంత్రతకు విలువేముంటుంది? ఇప్పటికే కొన్ని అంశాల వలన ఈసీ తన ఔన్నత్యాన్ని ప్రశ్నార్థకం చేసుకుంది. కాబట్టి, వీలైతే సమాజంలో చైతన్యానికి పాటుపడాలే తప్ప, గంగిరెద్దులా తలూపడం, ఏలికలకు వంతపాడటం వ్యవస్థలకు తగని పని.